PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 87 | విజయవాడ, శనివారం 28 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 28 October 2023 | Rs

భద్రత లేని అసంఘటిత కార్మికులు

- సంక్షేమ నిధులను దారి మళ్లించిన సర్కారు
- రాష్ట్ర సదస్సులో వక్తలు

2



పాక్ సెమీస్ ఆశలకు దక్షిణాఫ్రికా గండి

- మార్క్రమ్ ఒంటరి పోరాటం
- ఉత్కంఠపోరులో సఫారీలు గెలుపు

6



పసుపు గోల్‌మాల్

•పాడేరు ఐటిడిఎలో అక్రమాలు •ట్రైకార్ బృందం నిర్ధారణ!

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

పాడేరు ఐటిడిఎలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలిసింది. నిబంధనలను గాలికొదిలేసి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలు బేఖాతరు చేయడం, ఇ ప్రొక్యూర్‌మెంటుకు బదులుగా సాధారణ టెండర్లు పిలవడం, సమయాన్ని భారీగా కుదించడంద్వారా అస్మదీయులకే అవకాశం ఇవ్వడం వంటి చర్యల ద్వారా కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్లు తెలిసింది. 84.76 కోట్ల రూపాయలతో చేపట్టిన పసుపు ప్రాజెక్టులో చోటుచేసుకున్న అక్రమాలను ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) కూడా నిర్ధారించినట్లు తెలిసింది.అక్రమాలపై విచారణ నిర్వహించిన ట్రైకార్ బృందం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నా నామమాత్రపు చర్యలు కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇలా వెలుగులోకి ...!

పసుపు ప్రాజెక్టులో బకాయిల కోసం ఒక కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించడంతో అక్రమాల డొంక కదిలింది. హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ఆర్థిక శాఖ ఆ కాంట్రాక్టర్‌కు 4.19 కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ నేపథ్యంలో అసలు ప్రాజెక్టులో ఏం జరుగుతోందో పరిశీలించాలని ట్రైకార్‌ను ఆదేశించింది. ప్రాథమిక పరిశీలనలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ట్రైకార్ పేర్కొంది. ఆర్థికశాఖ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయికి వెళ్లి ట్రైకార్ బృందం చేసిన పరిశీలనలో అవకతవకలు వాస్తవమని నిర్ధారణ అయినట్లు తెలిసింది. అక్రమాలు ఎలా జరిగియి? వాటికి బాధ్యులెవరు అన్న అంశాలను వివరిస్తూ ట్రైకార్ అధికారులు మార్చి నెలలోనే సుదీర్ఘ నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిసింది.

కలెక్టర్‌నే ఏమార్చారు...!

పసుపు ప్రాజెక్టులో భాగంగా విత్తనాల కొనుగోళ్లలో అనేక నిబంధనలను ఐటిడిఎ అధికారులు ఉల్లంఘించారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్‌నే ఏమార్చడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. ప్రభుత్వానికి ట్రైకార్ ఇచ్చిన నివేదికలో దీనిని వివరంగా ప్రస్తావించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం జిల్లా కలెక్టర్‌కు పంపిన ఫైలులో పసుపు ప్రాజెక్టు గురించి అసలు వివరించలేదని సమాచారం. ప్రాజెక్టుకు ఎంత మొత్తం కేటాయించారు? దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎంత? అన్న ప్రస్తావనను కూడా చేయలేదని తెలిసింది. పాజెక్టులో భాగంగా అమలు చేస్తున్న స్కీమ్‌లు, అవసరమైన ముడిపదార్థాలు, వాటికోసం అవసరమైన నిధుల వివరాలను కూడా ప్రస్తావించకుండా ప్రాజెక్టు లక్ష్యాలను మాత్రమే పేర్కొని అమలుచేయడానికి అనుమతిని కోరినట్లు తెలిసింది. అయినా 'ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పథకాన్ని అమలు చేయాలి' అని ఉత్తర్వులు జారీ చేశారు. అయినా, అనేక నిబంధనలను ఐటిడిఎ అధికారులు ఉల్లంఘించినట్లు ట్రైకార్ అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

అక్రమాలు ఇలా...!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష రూపాయలు దాటిన ప్రతి పనిని ఇ -ప్రొక్యూర్‌మెంట్ ద్వారానే చేయాలి. ఐటిడిఎ అధికారులు ఈ నిబంధనను ఏమాత్రం ఖాతరు చేయలేదు. 4.19 కోట్లరూపాయల విలువైన సీడ్ కొనుగోలు ప్రక్రియను ఇ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కాకుండా బాక్స్ టెండర్ల ద్వారా నిర్వహించినట్లు ట్రైకార్ పరిశీలనలో తేలింది. పాడేరు ఐటిడిఎలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానం లేదంటూ తాము చేసిన పనిని సమర్థించుకోవడానికి అధికారులు ప్రయత్నించారని, అయితే అది సరికాదని ట్రైకార్ పేర్కొన్నట్లు సమాచారం. మరికొన్ని ఇతర అంశాల్లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అమలు చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి పాడేరు, ఐటిడిఎకు సంబంధించి ఆరుగురు అధికారులను బాధ్యులుగా గుర్తించినట్లు తెలిసింది. 25 మినీ బాయిలర్లు, 25 మినీ పాలీషర్ల కొనుగోళ్లకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో గడువును కుదించారు. నిబంధనల ప్రకారం కనీసం 14 రోజులు గడువు ఇవ్వాల్సి ఉండగా, కేవలం వారం రోజులు మాత్రమే ఇచ్చారు. పోటీని తగ్గించడానికే ఈ పనిచేశారని ట్రైకార్ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ చర్య ద్వారా తమకు కావాల్సిన వారికే టెండర్ దక్కేలా చూశారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం 5శాతం ఎక్సెస్‌కే అనుమతి ఇవ్వాల్సిఉండగా, 21.3శాతం అదనపు రేటును ఖరారు చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అగ్రిమెంటు బాండ్ అందుబాటులో లేదని సమాచారం. ఇ- ప్రొక్యూర్‌మెంట్‌లో మిగతా 5లో



దక్షిణ గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ధ్వంసమైన భవన శిథిలాల మధ్య పాలస్తీనియన్లు

ఉత్తర గాజాలో మారణహోమం

- ఇజ్రాయిల్ భూతల దాడులు ఉధృతం
- మద్దతుగా అమెరికా యుద్ధ నౌకలు
- కాల్పుల విరమణకు ఐరాసలో తీర్మానం
- అడ్డుకున్న అమెరికా, బ్రిటన్

జెరూసలెం : అమెరికా, ఇతర పశ్చిమ దేశాల అండ చూసుకుని యూదు దురహంకార ఇజ్రాయిల్ పేట్రేగిపోతోంది. అటు వైమానిక దాడులు, ఇటు భూతల దాడులతో గాజాలో పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్నది. కాల్పుల విరమణ ప్రకటించాలని రష్యా, చైనా, అరబ్ దేశాలు, ఐక్యరాజ్య సమితి పదే పదే చేసిన విజ్ఞప్తులను బేఖాతరుల చేస్తూ ఇజ్రాయిల్ తన యుద్ధ ట్యాంకులను ఉత్తర గాజాపైకి పంపింది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా తన భారీ యుద్ధ విమాన వాహక నౌకలను మధ్య ధరాసముద్ర తీరంలో మోహరించింది.హమాస్‌కు మద్దతుగా ఇరాన్, సిరియా జోక్యం చేసుకుంటాయన్న నెపంతో పశ్చిమ దేశాలు తమ సైనిక పటాలాలను, యుద్ధ సామగ్రిని ఇజ్రాయిల్‌కు దన్నుగా నిలబెడుతున్నాయి. గురువారం తెల్లవారుజామున గాజాపై ఇజ్రాయిల్ సైన్యం భూతల దాడులు పెద్దయెత్తున ప్రారంభించింది. గాజా శివారులోని షిజయాపై ఇజ్రాయిల్ విమానాలు, శతఘ్నులు జరిపిన బాంబు దాడుల్లో పెద్దయెత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. గత మూడు వారాలుగా గాజాలో కొనసాగుతున్న విధ్వంసకాండ, బాంబు దాడులతో జరుగుతున్న వినాశనం ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా తెలుస్తోంది. పలు ప్రాంతాలకు సంబంధించి యుద్ధానికి ముందు, ఇటీవలి రోజుల్లో తీసిన ఫోటోలు చూస్తుంటే విధ్వంసం చాలా పెద్దయెత్తున ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు అన్న విచక్షణ లేకుండా ఇజ్రాయిల్ యధేచ్ఛగా దాడులు చేస్తోంది. చివరికి ఐక్యరాజ్యసమితి, రెడ్ క్రాస్ సహాయక శిబిరాలను కూడా అవి విడిచిపెట్టడం లేదు. మరో వైపు అమెరికా యుద్ధ విమానాలు తూర్పు సిరియా లోని లక్ష్యాలపై దాడులు చేశాయని పెంటగాన్ ప్రకటించింది. సిరియా, ఇరాన్‌లపై యుద్ధానికి మిగతా 5లో

పట్టణాలు బాగుండాలంటే మోడీని గద్దెదించాలి

- రాష్ట్ర సదస్సులో వక్తలు

3

రాష్ట్రంలో ఓటర్లు 4,02,21,450

- ముసాయిదా జాబితా విడుదల
- మహిళా ఓటర్లు 2,03,85,851 మంది
- పురుష ఓటర్లు 1,98,31,791 మంది
- థర్డ్ జెండర్ ఓటర్లు 3,808 మంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ముసాయిదా ఒటర్ల జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. దీని ప్రకారం పురుషులు 1,97,66,013 మంది, మహిళలు 2,03,83,471 మంది, థర్డ్‌జెండర్ 3,808 మంది ఓటర్లుగా నమోదయ్యారు. సర్వీస్ ఓటర్లు పురుషులు 65,778 మంది, మహిళా ఓటర్లు 2,380 మంది ఉన్నారు. ఈ జాబితాపై డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

సుందరీకరణకు ప్రాధాన్యత

- పట్టణాల్లో రోడ్లపై దృష్టి
- రెసిడెంట్స్ అసోసియేషన్లతో టిడ్కో ఇళ్ల నిర్వహణ
- సమీక్షలో సిఎం జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నగరాలు, పట్టణాల్లో సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై దృష్టి సారించాలన్నారు. పట్టణాల్లో ఇప్పటికే కొనసాగుతున్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్వహణను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా చేపట్టాలని సూచించారు. జగనన్న కాలనీల్లోనూ నీటి సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. నగరాల్లో పెద్దయెత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్, సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు (ఎస్‌టిపి) నిర్వహణ, పారిశుధ్యం కోసం అత్యాధునిక యంత్రాలను వివిధ ప్రాజెక్టుల కింద తీసుకొస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థుల్లో పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల కోసం అవసరమయ్యే సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల నిర్వహణ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఒపి) ఉండాలన్నారు. నీటి సంరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వరదల వల్ల నెల్లూరు మునిగిపోయే పరిస్థితులు రాకుండా రక్షణగోడ నిర్మాణంపై దృష్టి సారించాలని తెలిపారు. రాజమండ్రిలో కంబాల చెరువు, హేవలాక్ బ్రిడ్జి సుందరీకరణ పనులతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం, కన్వెన్షన్ సెంటర్ పనులు పూర్తి చేయాలని, పార్కుల్లో గ్రీనరీకి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాల్వలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విజయవాడ, గన్నవరం విమానాశ్రయానికి వెళ్లే మార్గం వెంబడి సుందరీ కరణ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, కృష్ణానది రక్షణగోడ వెంట కూడా సుందరీకరణ చేయాలని ఆదేశించారు. విశాఖలో నాలుగేళ్ల కాలంలో రూ.3,529 కోట్ల విలువైన పనులు చేసినట్లు అధికారులు సిఎంకు వివరించారు. జనాభా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

హంద్రీ నీవాపై కొత్త ఎత్తిపోతల పనులు ఆపేయండి


- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంద్రీనీవా, సుజల స్రవంతి ప్రాజెక్టును విస్తరిస్తుందని, ఆ పనులను వెంటనే నిలిపివేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ఇరిగేషన్ ఇఎన్‌సి మురళీధర్ కెఆర్‌బిఎం చైర్మన్‌కు శుక్రవారం లేఖ రాశారు. భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తి గుమ్మగట్ట, రాయదుర్గం, డి.హిరేహల్, కనెకల్ మండలాల పరిధిలోని 58 మధ్యతరహా ట్యాంకులను నింపేందుకు ఎపి ప్రభుత్వం టెండర్లు పిలిచిందని ఇఎన్‌సి తెలిపారు. ఈ పనులకు అపెక్స్ కౌన్సిల్, సిడబ్ల్యుసి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు.

నన్ను చంపేందుకు కుట్ర

ఎసిబి కోర్టు జడ్జికి చంద్రబాబు లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జైలులో తనను అంతమొందించేందు కు కుట్ర జరుగుతోందంటూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎసిబి కోర్టు జడ్జికి లేఖ రాశారు. తన భద్రత, ఆరోగ్య సమస్యలపై అనుమానం వ్యక్తం చేస్తూ చంద్రబాబు బుధవారం రాసిన మూడు పేజీల లేఖను జైలు అధికారులు శుక్రవారం ఎసిబి కోర్టు జడ్జికి పంపారు. తనను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పికి కూడా లేఖ వచ్చిందని, దానిపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదని వివరించారు. తనను చంపేందుకు రూ.కోట్లు చేతులు మారినట్లు తెలిసిందని పేర్కొన్నారు. జైలుకు వచ్చినప్పుడు తనను అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారని, ఆ ఫుటేజీని పోలీసులే లీక్ చేశారని లేఖలో వివరించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజీని రిలీజ్ చేశారని పేర్కొన్నారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయన్నారు. జైలులో పెన్ కెమెరాతో డ్రగ్స్ కేసు నిందితుడు తిరుగుతున్నాడని తెలిపారు. ఆ ఖైదీ జైలు లోపల ఫొటోలు తీస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నెల 6న జైలు ప్రధాన ద్వారం మీదుగా డ్రోన్ ఎగురవేసి తన కదలికలు తెలుసుకునే ప్రయత్నం చేశారని అన్నారు. ములాఖత్‌లో తనను కలిసిన వారి చిత్రాల కోసం కూడా డ్రోన్‌ను వినియోగిస్తున్నారన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. జైలుపై డ్రోన్ ఎగురవేసింది వైసిపి వారేనని అనుమానమని లేఖలో పేర్కొన్నారు. డ్రోన్ ఘటన ప్రధాన సూత్రధారి ఎవరో గుర్తించలేదని, జైలు అధికారుల నిస్సహాయతకు ఇది నిదర్శనమని అన్నారు. కొందరు గంజాయి ప్యాకెట్లు జైల్లోకి విసిరితే గార్డెనింగ్ విధుల్లోని ఖైదీలు వాటిని పట్టుకున్నారన్నారు. రాజమండ్రి జైలులో మొత్తం 2,200 మంది ఖైదీలు వుంటే, అందులో 750 మంది డ్రగ్స్ కేసు నిందితులని వివరించారు. కొంతమంది ఖైదీల వల్ల తన భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జడ్ ప్లస్ కేటగిరి రక్షణలో ఉన్న తన భద్రతకు ఇది తీవ్రమైన ముప్పు అని లేఖలో పేర్కొన్నారు. తనకు అనారోగ్య సమస్యలు వున్నాయని మెరుగైన వైద్యసేవలు అవసరమని తెలిపారు.

నాట్ బిఫోర్ మీ

చంద్రబాబు బెయిల్ కేసుల విచారణ నుంచి తప్పుకున్న జడ్జి

అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ప్రధాన బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ అనుబంధ పిటిషన్ల విచారణ నుంచి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ తప్పుకున్నారు. దసరా సెలవుల ప్రత్యేక బెంచ్ (వెకేషన్ కోర్టు బెంచ్) ఎదుట శుక్రవారం ఆ పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్లలో వకాలత్ వేసిన న్యాయవాది, ఒక న్యాయాధికారి భర్త అని, ఆ న్యాయవాది దాఖలు చేసిన కేసులను తను విచారించలేనని జస్టిస్ ప్రకటించారు. నాట్ బిఫోర్ మీ అంటూ ఇంతకుమించి తానేమీ చెప్పలేనన్నారు. మనస్సాక్షి అంగీకరించడం లేదన్నారు. పిటిషనరు చంద్రబాబు అనారోగ్య పరిస్థితులను వివరిస్తూ దాఖలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఎదుట ఉంచాలని, ఈ నెల 30న విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ కల్పించుకుని, అత్యవసర విచారణకు వీలుగా రిజిస్ట్రీకి ఆదేశాలివ్వాలని కోరారు. పిటిషన్‌ను తగిన బెంచ్‌కు పోస్ట్ చేసేందుకు తామిచ్చిన ఉత్తర్వులు అడ్డంకి కాబోదని న్యాయమూర్తి తెలిపారు.

మెడికల్ ఎకో సిస్టమ్ ఎంతో అవసరం

ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో కేంద్ర మంత్రి మాండవీయ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మెడికల్ ఎకో సిస్టమ్‌ను తీసుకురావడం ఎంతైనా అవసరమని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలను వర్చ్యువల్‌గా ఆయన శుక్రవారం ప్రారంభించారు. తొలుత కింగ్‌జార్జ్ ఆస్పత్రిలో రూ.23.75 కోట్లతో ఏర్పాటు చేయనున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవంలో వర్చ్యువల్‌గా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేశంలోనే పురాతన వైద్య కళాశాల విశాఖలో ఉండటం ఆ ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. వైద్య సేవలకు వేల కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కెజిహెచ్ అభివృద్ధికి రూ.600 కోట్లు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల కోసం రూ.246 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్‌ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి రమేశ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, ఎఎంసి సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టి.రవిరాజు పాల్గొన్నారు. ఆదివారం ఉపరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ పాల్గొననున్నారు.



శతాబ్ది ఉత్సవాల్లో వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర మంత్రి మాండవీయ, మాట్లాడుతున్న మంత్రి రజని

'క్రిమినల్' ముసాయిదా నిలుపుదల

- పార్లమెంటు స్థాయి సంఘంలో ప్రతిఘటన
- ఆరున మళ్లీ చర్చ

న్యూఢిల్లీ: పార్లమెంటరీ స్థాయి సంఘంలో తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదురుకావడంతో ప్రస్తుతమున్న క్రిమినల్ చట్టాల స్థానంలో ప్రతిపాదించిన మూడు బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కు తగ్గింది. ఈ మేరకు హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీలో ప్రవేశపెట్టిన ముసాయిదా నివేదికను నిలిపివేసింది. శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు స్టాండింగ్ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు నివేదికను పరిశీలించేందుకు అవసరమైన సమయం ఇవ్వలేదని అధికార పక్షాన్ని నిలదీశారు.ముసాయిదా నివేదిక ఇంగ్లీషు ప్రతిని గత వారం సభ్యులుకు ఇవ్వగా, హిందీ ప్రతిని సమావేశం ప్రారంభం కావడానికి కొంత సమయం ముందు ఇచ్చారు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ సభ్యులు నిలదీశారు. లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్‌చౌదరి. పి, చిదంబరం, టిఎంసికి చెందిన డెరిక్ ఒబ్రియాన్‌లతో పాటు డిఎంకె మిగతా 2లో

నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపండి

రాష్ట్రపతి ముర్ముకు స్టాలిన్ విజ్ఞప్తి



చెన్నై : నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. తమిళనాడు పర్యటనను ముగించుకుని ఢిల్లీ వెళుతున్న రాష్ట్రపతికి విమానాశ్రయంలో ఈ మేరకు ఆయన ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్‌లో అర్హత సాధించాలనే తొలగించాలని కూడా ముఖ్యమంత్రి ఆ వినతిపత్రంలో కోరారు. రాష్ట్రపతికి వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ మంత్రి కె. పొన్ముడి, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. తమిళనాడు అడ్మిషన్ టూ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సెస్ బిల్లు 2021 రాష్ట్రపతి ఆమోదం కోసం సంవత్సరానికి పైగా పెండింగ్‌లో ఉందని స్టాలిన్ గుర్తు చేశారు. 'నీట్ ఆధారంగా వైద్య కోర్సుల ప్రవేశం పేద, వెనుకబడిన విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని ప్లస్ 2 ద్వారా ప్రవేశ ప్రక్రియను తమిళనాడు ఎంచుకుంది. అయితే ఈ ప్రక్రియ కేంద్రం నీట్‌ను ప్రవేశపెట్టడంతో నిలిచిపోయింది' అని తన వినతి పత్రంలో స్టాలిన్ గుర్తు చేశారు. ఈ బిల్లును సెప్టెంబరు 2021న తమిళనాడు అసెంబ్లీలో ఆమోదించి గవర్నరకు పంపారు. ఐదు నెలలు తరువాత గవర్నర్ దీనిని వెనక్కి పంపారు. మళ్లీ 2022 ఫిబ్రవరిలో అసెంబ్లీలో ఈ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపారు. దీంతో గవర్నర్ ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. అప్పటి నుంచి వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు అడిగిన వివరణలను తమిళనాడు ప్రభుత్వం వెంట వెంటనే పంపుతూ వస్తున్నా ఈ బిల్లుకు ఇంకా మోక్షం లభించలేదు. ఈ ఏడాది ఆగస్టు 14న రాష్ట్రపతికి స్టాలిన్ లేఖ రాశారు.. బిల్లు ఆమోదం లో జాప్యం కారణంగా అతి ఖరీదైన కోచింగ్ సౌకర్యాలు పొందలేని అనేక మంది అర్హులైన విద్యార్థులకు మెడికల్ ప్రవేశాలు లేకుండా చేస్తుందని స్టాలిన్ తెలిపారు.

నేటి నుంచి టెన్త్ ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి నవంబరు 11 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చునని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125 చెల్లించాలి. మూడు సబ్జెక్టులలోపు రాసేవారు రూ.110, తక్కువ వయసు ఉన్నవారు రూ.300 చెల్లించాలని పేర్కొన్నారు. వొకేషనల్ రెగ్యులర్ విద్యార్థులు రూ.125లతోపాటు అదనంగా రూ.60 చెల్లించాలి. రూ.50 అపరాధ రుసుంతో నవంబరు 16వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో నవంబరు 22 వరకు, రూ.500 అపరాధ రుసుంతో నవంబరు 30 వరకు చెల్లించవచ్చునని వివరించారు. ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన యూజర్ ఐడి, పాస్‌వర్డుతో ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్ ఒఒఒ.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅలో లాగిన్ అయి చెల్లించాలన్నారు. నామినల్ రోల్స్ కూడా అప్‌లోడ్ చేయాలని వెల్లడించారు.

కెఎల్‌యులో యువతి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


శృతి (ఫైల్)

గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కోనేరు లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాల (కెఎల్‌యు) క్యాంటీన్‌లో పనిచేసే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... గుండిమెడకు చెందిన శతి (18) గ్రామానికి సమీపంలో ఉన్న కెఎల్‌యు క్యాంటీన్‌లో పనికి వెళ్తున్నారు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఇంటి నుండి క్యాంటీన్‌లో పనికి వెళ్లిన శృతి రాత్రైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కెఎల్ యూనివర్సిటీకి వెళ్లి ఆరా తీశారు. విధులు ముగిసిన వెంటనే శృతి వెళ్లిపోయిందని క్యాంటిన్ సిబ్బంది చెప్పడంతో వారు ఇంటికి వచ్చారు. శుక్రవారం ఉదయం కెఎల్ యూనివర్సిటీ సిబ్బంది ఫోన్ చేసి శృతికి బాగోలేదని, ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని చెప్పారు. ఆస్పత్రికి వెళ్లే సరికి ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో కుమార్తె విగతజీవిగా పడి ఉండడంతో తల్లిదండ్రులు అరుణ్ కుమార్, దుర్గ బోరున విలపించారు. వర్సిటీ భవనం 6వ అంతస్తు నుండి దూకినట్లు సిబ్బంది చెప్పారని వాపోయారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే, శతి మతి విషయాన్ని కెఎల్‌యు యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తపల్లి



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘట న నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం లో చోటు చేసు కుంది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నందికుంట గ్రామానికి చెందిన రైతు అబ్దుల్ రజాక్ (38) తనకున్న మూడెకరాల సొంత పొలంతో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పలు పంటలు సాగు చేసేవారు. సాగు నిమిత్తం సుమారు రూ ఆరు లక్షలు అప్పు చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు చేతికందక పోవడంతో వడ్డీల భారం అధికమైంది. రుణదాతల ఒత్తిళ్ల తాళలేక గురువారం రాత్రి పొలం వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ రెండేళ్ల కాల వ్యవధిలో ఈ గ్రామంలో దాదాపు నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

చంద్రబాబు భద్రతపై అప్రమత్తంగా ఉన్నాం


- జైళ్లశాఖ డిఐజి రవికిరణ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చంద్రబాబు భద్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నామని జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద ఆయన శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. 24 గంటలూ సెక్యూరిటీతోపాటు అదనపు సిసి కెమేరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. జైలు చుట్టూ ఐదు వాచ్‌టవర్స్ ఉన్నాయన్నారు. ఈ నెల 22న జైలు వాటర్ ట్యాంక్‌వైపు ఒక డ్రోన్ తిరిగిందని నార్త్ ఈస్ట్ వాచ్‌టవర్ గార్డు నుంచి తమకు సమాచారం వచ్చిందని, క్లోజ్డ్ జైల్ వైపు ఆ డ్రోన్ రాలేదని తెలిపారు. దీనిపై జైళ్లశాఖ నుంచి సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చామన్నారు. మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ నకిలీదిగా పోలీసుల విచారణలో తేలిందన్నారు. జైలు నుంచి చంద్రబాబు రాశారంటూ చెబుతున్న లేఖకు జైలు అధికారుల అటెస్టేషన్ చేయలేదని చెప్పారు. శ్రీనివాస్ అనే ఖైదీని రిమాండ్‌కు తెచ్చినప్పుడు ఆయన వద్ద ఒక బటన్ కెమెరా ఉన్నట్లు గుర్తించామని, అందులో ఎలాంటి జైల్ ఫుటేజీ లేదని చెప్పారు. చంద్రబాబు కుడి కంటి కేటరాక్ట్ ఆపరేషన్‌కు సంబంధించి రాజమండ్రి జిజిహెచ్ వైద్యులు పరీక్షలు చేశారని, చంద్రబాబుకు ఇమ్మెచ్యూర్ కేటరాక్ట్ ఉన్నట్టు వైద్యులు గుర్తించారని చెప్పారు. కొంత సమయం తరువాతైనా ఆపరేషన్ చేయించుకోవచ్చని వైద్యులు సూచించినట్టు తెలిపారు. చంద్రబాబు ఆరోగ్య నివేదికలను ఎప్పటికప్పుడు కోర్టుకు సమర్పిస్తున్నట్టు వెల్లడించారు. చంద్రబాబును ఫోటో తీసిన వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ కొనసాగుతోందన్నారు.

భద్రత లేని అసంఘటిత కార్మికులు

- సంక్షేమ నిధులను దారి మళ్లించిన సర్కారు
- రాష్ట్ర సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-నెల్లూరు

బిజెపి అనుసరిస్తోన్న తప్పుడు విధానాల వల్ల దేశంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుందని, దానిని రాష్ట్ర ప్రభుత్వం సమర్థిస్తుందని, ఇదే జరిగితే దేశ ప్రజలు దివాలా తీస్తారని, ఆర్థిక భారాలతో విలవిల్లాడుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో, దేశంలో అసమానతలు లేనటువంటి అభివృద్ధి సాధించాలన్న నినాదంతో ప్రజలను సమీకరించాలని సిపిఎం భావించిందని, ఆ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వి.ఉమామహేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. భవన నిర్మాణ రంగం కార్మికులకు చంద్రన్న, జగనన్న ఇద్దరూ ఒక్క రూపాయి కూడా అందజేయలేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయోజనాల నిమిత్తం కాజేసిందన్నారు. దేశంలో కోట్లాది మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని, జిల్లాలో రెండు లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు జీవిత భద్రత లేదన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే , కాదు మేము పది సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని బిజెపి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాని, విభజన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోని ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.. ఈ సదస్సులో దాదాపుగా 16 డిమాండ్లతో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టాన్ని ప్రభుత్వం రూపొందించాలంటూ తీర్మానం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, నాయకులు జి.నాగేశ్వరరావు, మహిళా నాయకులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ , తదితరులు ప్రసంగించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, సిఐటియు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషి

- 2024లో టిడిపి, జనసేన కూటమిదే విజయం : భువనేశ్వరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

చంద్రబాబు నిర్దోషి.. అక్రమ కేసులో 50 రోజులు ఆయన్ను జైల్లో పెట్టించిన జగన్ సర్కార్ నేరాన్ని రుజువు చేయలేక ఢీలాపడిందంటూ నారా భువనేశ్వరి అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి - జనసేన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. 'నిజం గెలవాలి' పేరుతో టిడిపి చేపట్టిన యాత్ర శుక్రవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో భువనేశ్వరి మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం జైలులో నిర్బంధించింది చంద్రబాబును కాదని, రాష్ట్రాన్ని, న్యాయాన్ని అని తెలిపారు. అందుకే రాష్ట్రం కోసం, భావితరాల కోసం పోరాడదామని కోరారు. ఇక్కడికి రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదని, నిజం గెలవాలని చెప్పేందుకే వచ్చానని తెలిపారు. ప్రజలే దేవుళ్లన్న ఎన్‌టిఆర్ స్ఫూర్తితో చంద్రబాబు ఎన్‌టిఆర్ ట్రస్టును నెలకొల్పి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితమంతా ప్రజలు- రాష్ట్ర అభివృద్ధి అన్నట్లు సాగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలు తీసుకొచ్చి, లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. జగన్ పాలనలో


సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ఎదిరిస్తే చంపడం, కేసులు పెట్టి వేధించడమే తప్ప రాష్ట్రాన్ని అభివద్ధి చేయాలని, యువతకు ఉద్యోగాలు తీసుకురావాలనే ఆలోచన లేదని విమర్శించారు. జగన్ సర్కార్ ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారంటూ కితాబిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పనబాక లక్ష్మి, అమర్నాథ్‌రెడ్డి, వంగలపూడి అనిత, అనురాధ, రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, పులివర్తి నాని, నరసింహ యాదవ్, బొజ్జల సుధీర్ రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- ఎపి మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కోరింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ఎపి మోడల్ స్కూల్స్ సెక్రటరీ కెవి కృష్ణారెడ్డికి వినతిపత్రం అందించినట్లు ఫెడరేషన్ కన్వీనర్ పి చంద్రశేఖర్, కో కన్వీనర్ బాలాజీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కరోనా సందర్భంగా అనారోగ్యంతో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు వేరే శాఖల్లోని ఖాళీ పోస్టుల్లో కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు.

సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరామని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సెక్రటరీ కృష్ణారెడ్డి వెల్లడించారని పేర్కొన్నారు. 2013-14 సంవత్సరం నుంచి రావాల్సిన సిపిఎస్ అమౌంట్‌ను ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయడానికి ఫైల్ సిద్ధమయినట్లు చెప్పారని అన్నారు. డిసెంబరు లోపు జీరో సర్వీస్‌తో బదిలీలు నిర్వహించడానికి అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అవసరమైనచోట గెస్ట్ ఫ్యాకల్టీని నియమించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. తెలుగు టిజిటిలను అప్‌గ్రేడ్ చేయాలని, వర్క్‌లోడ్ అందరికీ సమానంగా ఉండేటట్లు చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.



జనవరి 5న తుది ఓటర్ల జాబితా

- సిఇఒ ముఖేష్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తుది ఓటర్ల జాబితాను జనవరి ఐదో తేదీన ప్రకటించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) ముఖేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముసాయిదా జాబితాను విడుదల చేసిన ఆయన రాజకీయ పార్టీలకు జాబితా సిడిలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ముసాయిదా జాబితాపై డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. 26.12.2023న క్లెయిమ్స్, అభ్యంతరాలపై తుది నిర్ణయం వెల్లడించనున్నారు. 01.01.2024న కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని 05.01.2024న తుది జాబితాను వెల్లడించనున్నట్లు సిఇఒ ప్రకటించారు. అభ్యంతరాలను పరిష్కరించేందుకు నవంబరు 4, 5 తేదీలు, డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేకంగా స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నారు. క్యాంపుల సందర్భంగా రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్‌తో పాటు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు చెందిన బిఎల్‌ఒ ఓటరు జాబితాలను పరిశీలించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఫైల్ చేయాలనుకుంటే voters.eci.gov.in లేదా మొబైల్ యాప్ ద్వారా ఫైల్ చేయవచ్చని సూచించారు.

యువతకు మరింత అవకాశం కల్పించాలి : సిపిఎం

సమావేశానంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ.. యువత మరింతగా ఓట్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరినట్లు వెల్లడించారు. కొందరు అధికారులు ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని, ఇసి మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ఎన్నికలు ముగిశాక చాలా మంది రాష్ట్రంలో ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. పర్చూరులో సిఐ, ఎస్‌ఐ డేటా చౌర్యం చేశారని, వారిని సస్పెండ్ చేశారని, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సిఇఒకు ఇదే విషయాన్ని ఫిర్యాదు చేశామన్నారు. పామర్రులో పదివేల దొంగోట్లు చేర్చుకునేందుకు వైసిపి ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నేతలు ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని సిఇఒకు తెలిపామన్నారు.

జిల్లాల వారీ ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	మొత్తం
శ్రీకాకుళం	9,24,125	9,19,078	173	18,43,376
విజయనగరం	7,55,295	7,67,507	102	15,22,904
పార్వతీపురం మన్యం	3,78,299	3,94,343	65	7,72,707
అల్లూరి సీతారామరాజు	3,57,184	3,83,640	33	7,40,857
విశాఖపట్నం	9,54,483	9,64,726	133	19,19,342
అనకాపల్లి	6,16,967	6,44,643	47	12,61,657
కాకినాడ	7,84,509	8,05,808	239	15,90,556
అంబేద్కర్ కోనసీమ	7,41,525	7,48,049	22	14,89,596
తూర్పు గోదావరి	7,64,359	7,96,605	108	15,61,072
పశ్చిమ గోదావరి	7,10,448	7,37,854	77	14,48,379
ఏలూరు	7,79,541	8,09,640	123	15,89,304
కృష్ణా	7,21,780	7,61,546	90	14,83,416
ఎన్‌టిఆర్	8,02,368	8,37,019	157	16,39,544
గుంటూరు	8,41,796	8,95,437	214	17,37,447
బాపట్ల	6,21,735	6,46,112	75	12,67,922
పల్నాడు	8,35,184	8,67,308	214	17,02,706
ప్రకాశం	8,94,140	8,92,862	108	17,87,110
పొట్టి శ్రీరాములు నెల్లూరు	9,36,083	9,75,104	245	19,11,432
కర్నూలు	9,80,227	9,92,397	306	19,72,930
నంద్యాల	6,71,225	6,89,305	271	13,60,801
అనంతపురం	9,87,727	9,91,816	232	19,79,775
శ్రీసత్యసాయి	6,86,564	6,81,846	61	13,68,471
వైఎస్‌ఆర్	7,86,262	8,12,802	246	15,99,310
అన్నమయ్య	6,69,849	6,89,492	138	13,59,479
చిత్తూరు	7,67,068	7,81,976	108	15,49,152
తిరుపతి	8,63,048	8,98,936	221	17,62,205
మొత్తం	1,98,31,791	2,03,85,851	3,808	4,02,21,450

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంటు చేయాలి

- సిఎంకు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ లేఖ
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మున్సిపాల్టీ, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న దాదాపు 40 వేల కార్మికులందరినీ పర్మినెంటు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. 20 ఏళ్ల నుంచి చాలీచాలని నామమాత్రపు వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు జీవితాలు గడుపుతున్నారని వివరించారు. ఒక స్కేలు లేదని, డిఎ, ఇంటి అద్దె అలవెన్స్, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు లేవని తెలిపారు. 60 ఏళ్లకు రిటైరైతే గ్రాట్యూటీ, పెన్షన్ లేదని పేర్కొన్నారు. 5, 6 ఏళ్లకు పెంచే మొద్దు అంకె వేతనం తప్ప ఎలాంటి ఎదుగూ, బొదుగూ లేని బానిస బతుకులు బతుకుతున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 8, 9 పిఆర్‌సిల ప్రకారం కనీస వేతనం రూ.3,900, రూ.6,700 అమలు చేశారని గుర్తు చేశారు. 2014లో ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించిన సందర్భంలో కూడా రూ.1600 పెంచారని తెలిపారు. 2013లో పిఆర్‌సి వేతనాలు, మధ్యంతర భృతి, కరువుభత్యం, హెచ్‌ఆర్‌ఎ అమలు చేసేందుకు జిఒ 1615 జారీ చేశారని, దీనిని అమలు చేయలేదని అన్నారు. గత ప్రభుత్వం 10వ పిఆర్‌సి ప్రకారం రూ.13 వేలు చెల్లించలేదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 11వ పిఆర్‌సి ప్రకారం రూ.20 వేలు చెల్లించాల్సి ఉండగా, రూ.5 వేలు తగ్గించి రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తుందని వివరించారు. వైసిపి అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంటు చేస్తామని ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో, పాదయాత్రలో హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగున్నరేళ్లు గడిచినా ఏ ఒక్కరినీ పర్మినెంటు చేయలేదని పేర్కొన్నారు. ఈ నెల 21న 114 జివో ద్వారా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్నట్లు ప్రకటించారని, అందులో ఒక్క మున్సిపాల్టీ ఉద్యోగి కూడా లేరని అన్నారు. తమను ఆప్కాస్ అనే బానిస వ్యవస్థలోకి నెట్టి పర్మినెంట్‌కు అర్హులు కాదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కలిసొచ్చే సంఘాలతో నిరవధిక సమ్మెకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి, కమిషనరుకు లేఖను పంపారు.

'క్రిమినల్' ముసాయిదా నిలుపుదల

(మొదటి పేజీ తరువాయి)

ఇతర పార్టీల సభ్యులు కూడా తమకు మరింత సమయం కావాలని పట్టుబట్టారు. కీలకమైన బిల్లుల విషయంలో ఇలా బుల్డోజ్ చేయడం, ఏక పక్షంగా వ్యవహరించడం సరికాదని వారు విమర్శించారు. అత్యంత కీలకమైన బిల్లులు కాబట్టి అధ్యయనం చేసేందుకు తమకు కనీసం రెండు నుండి మూడు నెలల సమయం కావాలని వారు పట్టుపట్టారు. ఇదే విషయాలను పేర్కొంటూ కాంగ్రెస్ నేత చిదంబరం ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లుల విషయంలో విస్తృతంగా చర్చ జరగాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ముసాయిదాను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించిన స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ నవంబర్ 6న ఇదే విషయాన్ని చర్చించడానికి మరోసారి సమావేశం కానున్నట్లు తెలిపారు.

వలస కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీసత్యసాయి జిల్లాలో గోరంట్ల మండలం కలిగిరి, వానవోలు గ్రామాలకు చెందిన 13 మంది వలస కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, భూమిలేని పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వలస కార్మికుల మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం తీవ్రమైన కరువు వల్ల గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడం, ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించకపోవడంతో బతుకు తెరువు కోసం కార్మికులు అనివార్యంగా బెంగళూరు వెళుతున్నారని తెలిపారు. ప్రతియేటా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి 25 లక్షల నుండి 30 లక్షల మంది వలస పోతుంటారని, గ్రామాల్లో ప్రభుత్వం ఉపాధిహామీ పనులు కల్పించి ఉంటే ఇటువంటి ఘటనలు జరిగేవి కావని తెలిపారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించి అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

జగన్ సర్కారుకు కరువు నివారణపై దృష్టి లేదు : సిపిఐ

జగన్ సర్కారుకు కరువు నివారణ చర్యలపై దృష్టి లేదని, అందువల్లే కార్మికులు వలసలు పోతూ ప్రమాదాలకు గురవుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు పెరుగుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


దీక్షల్లో కూర్చున్న డిహెచ్‌పిఎస్ కార్యకర్తలు

ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు విఘాతం

- దళిత హక్కుల పోరాట సమితి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే రిజర్వేషన్లకు విఘాతం కలిగి దళిత, గిరిజనులు, వికలాంగులు, మహిళలు తీవ్రంగా నష్టపోతారని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుడాల రాంబాబు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 937వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిహెచ్‌పిఎస్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా పోరాటం కొనసాగుతున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టడం శోచనీయమన్నారు. ప్రజల ఆస్తి అయిన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీ సర్కారుకు లేదన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి ఇప్పటికైనా ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి కేంద్రం వెనక్కు తగ్గాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దీక్షల్లో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండే సత్యనారాయణ, నాయకులు కామేశ్వరరావు, అప్పలకొండ, పి.వెంకట్, భీంపల్లి రాము, ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

మంత్రి అంబటికి నిరసన సెగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో/అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబుకు ఖమ్మంలో నిరసన సెగ తగిలింది. ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు శుక్రవారం మంత్రి నగరానికి వచ్చారు. ఆయన బస చేసిన హోటల్ ఎదుట టిడిపి శ్రేణులు నిరసన తెలిపారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హోటల్ నుంచి బయటకు వచ్చిన ఆయన్ను టిడిపి కార్యకర్తలు చుట్టుముట్టారు. రాజకీయాలతో సంబంధంలేని నారా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఏదైనా ఉంటే రాజకీయంగా విమర్శలు చేసుకోవాలి గానీ.. వ్యక్తిగత దూషణలు సరికావని హితవు పలికారు. మంత్రి చెప్పే విషయాలు వినకుండానే టిడిపి కార్యకర్తలు బిగ్గరగా నినాదాలు చేయడంతో ఆగ్రహానికి గురైన అంబటి వారి వైపు దూసుకెళ్లారు. టిడిపి కార్యకర్తలూ అదే స్పీడుతో మంత్రి మీదకు వెళ్లడంతో హోటల్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు టిడిపి కార్యకర్తలను అదుపులోకి తీసుకుని మంత్రి వాహనాలకు లైన్ క్లియర్ చేశారు.

2 ఘటనలపై విచారణ జరిపించాలి : మంత్రి అంబటి రాంబాబు

ఖమ్మంలో వివాహ నిశ్చితార్థానికి వెళ్లిన తనపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. అలాగే ఖమ్మంకు వెళ్లేటప్పుడు తన కారుపై రెండు గోధుమల బస్తాలు పడ్డాయని, ఈ రెండు ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది క్రితం కార్తీక వనభోజనాల సందర్భంగా ఖమ్మంలోనే ఒక సామాజిక వర్గానికి చెందిన సమావేశంలో తనపై దాడిచేసిన వారికి రూ.50 లక్షలు ఇస్తామని బహిరంగంగా ప్రకటన చేశారని, ఇందుకు పెద్దమొత్తంలో చందాలు ఇస్తామని చెప్పారన్నారు. ఆ ప్రకటన మేరకే ఇప్పుడు దాడి జరిగిందనే అనుమానం వుందన్నారు. నిశ్చితార్థానికి వెళ్లి హోటల్‌లో వున్న తన వద్దకు హఠాత్తుగా పది మంది వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వచ్చి ఈ దాడి చేశారని ఆరోపించారు. ఒక మంత్రిగా సెక్యూరిటీ ఉన్న తనపైనే దాడి చేయాలని ప్రయత్నించారని అన్నారు. వారికి చంద్రబాబుపై ప్రేముంటే అది వేరేలా వ్యక్తం చేసుకోవాలి తప్ప భౌతిక దాడులకు దిగడం సరైంది కాదన్నారు. తనపై దాడి చేసేందుకు వచ్చిన వారివద్ద కర్రలు వున్నాయని తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- డైరెక్టరుకు సంక్షేమ సమాఖ్య వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య కోరింది. ఈ మేరకు శుక్రవారం శాఖ డైరెక్టరు లక్ష్మీశాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు అనూరాధ, ప్రధాన కార్యదర్శి ఎం గురుస్వామి మాట్లాడారు. సచివాలయాల విధుల్లో రెండు సంవత్సరాలు ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారికి ప్రొబేషన్ డిక్లేర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. నిర్దిష్ట ప్రమోషన్ ఛానెల్‌ను వెంటనే ప్రకటించాలని, పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న వెల్ఫేర్ సెక్రటరీలకు బిఎల్‌ఒ విధుల్లోంచి మినహాయించాలని కోరారు. మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు.

అన్ని రకాల సెలవులకు సంబంధించి హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో వెంటనే అప్‌డేట్ చేయాలని, ఎఫ్‌ఎసిలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎఫ్‌ఎసి అలవెన్సు ఇచ్చేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అందరికీ నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, ఉద్యోగుల్లో ఇద్దరి పిల్లల చదువులకు ప్రభుత్వం ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలకు పని ఒత్తిడి తగ్గించి పది గంటల నుండి ఐదు గంటల వరకూ డ్యూటీ టైం వర్తింపజేయాలని కోరారు. చిన్న చిన్న కారణాలతో సస్పెండ్ చేసిన కార్యదర్శులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగానే గుర్తించాలని కోరారు. విధి నిర్వహణలో గాయపడిన వారికి వైద్య సౌకర్యం కల్పించాలని, యూనిఫాం అలవెన్స్, రూరల్‌లో నాన్‌వెక్టార్ ప్రోగ్రాం, శానిటేషన్ వర్కు నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు.

మైనింగ్ అక్రమాలపై టిడిపి ఆందోళన

- పలువురు గృహనిర్బంధం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా సైదాపురంలో సాగుతోన్న మైనింగ్ అక్రమ దందా వ్యవహారంలో నిజాలు నిగ్గుతేల్చడానికి టిడిపి నేతలు శుక్రవారం చలో సైదాపురానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ పార్టీ ముఖ్యనేతలను ఇంటి నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. సంతపేటలోని తన నివాసం నుంచి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి బయలుదేరడానికి సిద్ధమవ్వగా భారీ సంఖ్యలో పోలీసులు వచ్చి, ఆయన్ను అడ్డుకున్నారు. వివాహానికి వెళ్లాలని, బయటకు వెళ్లడానికి అనుమతించాలని కోరినా పోలీసులు అనుమతించలేదు. పోలీసుల కళ్లుకప్పి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన వాహనంలో సైదాపురం చేరుకున్నారు. మార్గమధ్యలో లారీల్లో నెల్లూరుకు తరలిస్తున్న హిటాచీలను పరిశీలించి, లారీ డ్రైవర్లను ఆరా తీశారు. సైదాపురం మండలం, తుమ్మలతలుపూరుకు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు చేరుకుని, పరిశీలించారు. మీడియాలో రాసిన విధంగా సైదాపురంలో రూ. వేలకోట్ల అక్రమాలు జరిగాయన్నారు. రోజూ రూ.10 కోట్ల విలువైన తెల్లరాయి తరలిపోతుందని, ప్రభుత్వానికి ఎలాంటి లీజు చెల్లించకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు 15కి వాయిదా

ప్రజాశక్తి - విశాఖ లీగల్, అమరావతి

విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన కేసు విచారణ నవంబర్ 15కి వాయిదా పడింది. విశాఖ నగరంలోని ఎన్‌ఐఎ కోర్టులో ఈ కేసుకు సంబంధించి నిందితుడు శ్రీనివాసరావును శుక్రవారం ప్రవేశపెట్టారు. ఈ కేసుపై హైకోర్టులో ఏడు వారాల స్టే ఉత్తర్వులు ఉన్నందున ఎటువంటి ఆదేశాలు జారీ చేయకుండా న్యాయమూర్తి నవంబర్ 15కు వాయిదా వేశారు.

బెయిల్ ఇవ్వండి : హైకోర్టులో నిందితుడు పిటిషన్

శ్రీనివాసరావు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విశాఖలో ఎన్‌ఐఎ కోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించడంతో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఎన్‌ఐఎను ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 3కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఎవి రవీంద్రబాబుతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. పిటిషనరు శ్రీనివాసరావు గత ఐదేళ్లుగా జైల్లోనే ఉన్నాడని, బెయిల్ ఇవ్వాలని న్యాయవాది పి శ్రీనివాస్ వాదించారు.

పట్టణాలు బాగుండాలంటే మోడీని గద్దెదించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సరళీకరణ ఆర్థిక విధానాలను అవలంబిస్తూ, పట్టణ ప్రజలపై మోయలేని భారాలు మోపుతూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రధాని మోడీ గద్దె దిగితేనే పట్టణాలు బాగుపడతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. బిజెపి సర్కారును రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నమ్ముకుంటే మునిగిపోక తప్పదని హెచ్చరించారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంస్కరణలు - పట్టణ ప్రజలపై దుష్ప్రభావాలు' అనే అంశంపై విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు శుక్రవారం జరిగింది. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చెత్త, ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీల భారాలను మోపే మెయిన్ స్విచ్ కేంద్ర ప్రభుత్వం వద్దే ఉందని తెలిపారు. యూజర్ ఛార్జీలతో ప్రజల నడ్డివిరుస్తున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మోడీ సంస్కరణలకు వంతపాడడం దారుణమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు అందించే ప్రతి సేవనూ వ్యాపారమయం చేశారని, ఛార్జీల పేరుతో పేదలపై పెనుభారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు లక్షల ఇళ్లంటూ ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం... గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పటి వరకు ఎందుకు ప్రారంభించలేదన్నారు. జగనన్న కాలనీలు ప్రచారార్భాటంగా మారాయని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ పరిశ్రమలను పాలకులు మూసేసి వాటి స్థలాలను రియల్ ఎస్టేట్ సంస్థల కబంధ హస్తాల్లోకి పెట్టేస్తున్నారని విమర్శించారు.

టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు మాట్లాడుతూ నిధుల కుదింపే సంస్కరణల ఉద్దేశమని తెలిపారు. సదస్సులో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగన్, పీపుల్ ఫర్ ఇండియా నాయకులు బిఎల్.నారాయణ, వార్డు అధ్యక్షులు గురప్ప పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బాబూరావు

విద్యా సంస్థల్లో కీలక మార్పులు

- నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి రాధా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా సంభవించే పలు కీలక మార్పులు, సంస్కరణలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన వాటికి సంబంధించి ఎంతో మంది సలహాలు, సూచనలు చేశారని నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి రాధా పేర్కొన్నారు. సంస్కరణల అమలు చేయాలంటే కేంద్రస్థాయిలోని పలు విద్యా సంస్థల్లో వ్యవస్థాగతంగా ఎన్నో కీలక మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయంలో గత మూడు రోజుల నుంచి జరిగిన వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశం మొత్తం ఎపి స్టేట్ విజన్ ప్లాన్-2047ను అనుకరించేలా అద్భుతమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర పాఠశాల విద్యా విభాగంలో అమలుపరుస్తున్న పలు విద్యా ప్రమాణాలు, సంస్కరణల గురించి పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఉన్నత విద్యా విభాగంలో అమలుచేస్తున్న పలు కార్యక్రమాలను, లక్ష్యాలను వివరించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సాంకేతిక విద్య, ఉపాధి, శిక్షణ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలను, వాటి సాధనకు అమలు చేసేందుకు అవసరమైన ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ డిఎంఇఒ డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్, రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనరు సౌరభ్‌గౌర్, ఎపిఎస్‌ఎస్‌డిసి సిఇఒ ఎమ్‌డి వినోద్‌కుమార్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టరు బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘర్ ఘర్ కెసిసి అభియాన్‌లో రైతుల కార్డుల కోతలు!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఘర్ ఘర్ కెసిసి అభియాన్ పేరుతో రైతుల పథకాల ఖాతాలపై కోతలు పడనున్నాయా అంటే అవుననే సమాధానం వస్తోంది. రెండేసి ఖాతాలు, రెండు వేర్వేరు పథకాల్లో ఖాతాలు ఉన్నట్లు భావిస్తున్న కేంద్రం దానిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. అలా ఉన్న ఖాతాల కారణాన్ని చూపిస్తూ రైతుల పథకాలపై కోత పెట్టనున్నట్లు సమాచారం. ఇదే సమయంలో కిసాన్ క్రెడిట్ కార్డులు, పిఎం కిసాన్ పథకాల మధ్య ఉమ్మడి లబ్ధిదారుల ఖాతాలపైనా ఆరా తీస్తున్నారు. కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ పేరిట ఒక పథకాన్ని అమలు చేస్తోంది. రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ పరికరాల కొనుగోలు కోసం కిసాన్ క్రెడిట్ కార్డులను కూడా అందిస్తోంది. ఒకే రైతుకు రెండు రకాల పథకాలు అందుతున్నా యన్న కారణాన్ని చూపిస్తూ ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

ప్రధానంగా మూడు రకాల అంశాలపై ఈ డ్రైవ్‌లో దృష్టి సారించాలని నిర్ణయించారు. ప్రధానంగా ఒకే లబ్ధిదారుడు పలు బ్యాంకు శాఖల్లో వేర్వేరు కెసిసి ఖాతాలు కలిగి ఉన్నాడని కేంద్రం చెబుతోంది. ఇవి కొన్ని చోట్ల ఒకే బ్యాంకు ఖాతాల్లోగానీ, వేర్వేరు బ్యాంకు శాఖల్లోగానీ ఉన్నట్లు భావిస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులు తమ కెసిసి ఖాతాలను ఒక బ్యాంకులో, పిఎం కిసాన్ ఖాతాను వేరే బ్యాంకులో కొనసాగిస్తున్నారని కేంద్రం చెబుతోంది. ఈ నేపథ్యంలోనే కెసిసి, పిఎం కిసాన్ పథకాలను లబ్ధిదారులకు అందించే వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఎన్జీవో సంస్థల సహకారంతో డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ డ్రైవ్ అనంతరం ఒకటికన్నా ఎక్కువ పథకాల్లో ఉన్న రైతులకు వాటిని తొలగించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కరువు, రైతు సమస్యలపై పర్యటన : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కరువు, రైతు సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటనలకు తమ పార్టీ ప్రణాళిక రూపకల్పన చేసిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, దుర్భిక్ష పరిస్థితులపై టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. నవంబరులో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తామని తెలిపారు. సాగునీరు అందక కళ్లముందే పంటలు ఎండిపోతున్నా సిఎం జగన్‌కు రైతులపై కనీస కనికరం లేదని విమర్శించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, పల్నాడు, కృష్ణా డెల్టా, గోదావరి జిల్లాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయన్నారు. పట్టిసీమను సక్రమంగా వినియోగించుకోక పోవడం వల్ల 40 టిఎంసిల నీరు కోల్పోయామని, ఉద్దేశపూర్వకంగా పట్టిసీమ పంపులకు బూజు పట్టించారని అన్నారు. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా కోల్పోతే వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదంలో పడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రాణహాని : యనమల

చంద్రబాబు విషయంలో పాలకుల తీరు చూస్తే ఆయనకు ప్రాణహాని ఉందని అర్థమవుతోందని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. జైలుపై గతంలో డ్రోన్ తిరిగిన దానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి విచారణ చేపట్టలేదని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును జైలులో పెట్టినప్పటి నుంచి జైలు అధికారులు, వైద్యులు, ఇతరులు ఏం చేయాలో, ఏం మాట్లాడాలో అంతా సజ్జలే నిర్ణయిస్తున్నారని విమర్శించారు.

కాల్ డేటా పిటిషన్‌పై31న తీర్పు

- ఎసిబి కోర్టులో ముగిసిన వాదనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో సిఐడి అధికారులు ఎవరెవరితో మాట్లాడారో అనే వివరాలతో కాల్ డేటా రికార్డును ఇవ్వాలని చంద్రబాబు తరపున వేసిన పిటిషన్‌పై శుక్రవారం విజయవాడలోని ఎసిబి కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును ఈ నెల 31కి రిజర్వులో పెడుతూ ఎసిబి కోర్టు కేసును వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు తప్పు చేయలేదని నిరూపించుకునేందుకు ఈ కాల్ డేటా కీలకం అవుతుందని చంద్రబాబు తరపున న్యాయవాది వారించారు.

చంద్రబాబును విచారించిన గది పూర్తిగా దర్యాప్తు అధికారి నియంత్రణలో వుంటుందని, దర్యాప్తు అధికారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు బయటకు రావని తెలిపారు. అలాగే తమ పిటిషన్ వ్యక్తిగత గోప్యత కిందకు రాదన్నారు. కాల్ డేటాను ఇవ్వడం వల్ల అధికారుల వ్యక్తిగత సమాచారానికి, భద్రతకు ఇబ్బంది వుండదని అన్నారు. చంద్రబాబును అరెస్టు చేసే సమయంలో శాంతి భద్రతల సమస్య వస్తుందని జిల్లా పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారని, ఆ పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లు, వివరాలు తీసుకోవాల్సిన అవసరం సిఐడికి లేదని సిఐడి తరపు న్యాయవాదులు వాదించారు. ఉదయం ఆరు గంటలకు అరెస్టు చేసినట్లు చంద్రబాబే చెప్పారని, సిఐడి ఇచ్చిన రిమాండ్ రిపోర్టును బట్టి ఎసిబి కోర్టు విధించిన రిమాండ్‌ను హైకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. కాల్ డేటా రికార్డు కోరటం న్యాయ విరుద్ధమని, ఆ పిటిషన్‌ను కొట్టివేయాలని సిఐడి తరపున వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ఎసిబి కోర్టు తీర్పును ఈ నెల 31కి రిజర్వు చేస్తూ వాయిదా వేసింది.

అసైన్డ్ భూముల కేసు విచారణ..

అలాగే రాజధాని అసైన్డ్ భూముల కేసుకు సంబంధించి ఎసిబి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఫ్రీజ్ చేసిన తమ ఖాతాలను విడుదల చేయాలని మాజీ మంత్రి పి నారాయణ తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. గురునానక్ కాలనీలోని ఎస్‌బిఐ బ్యాంకులో ఖాతా వున్న అప్పుడు మున్సిపల్ మంత్రిగా వున్న పి నారాయణకు రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి నిధులు వెళ్లాయని ఎసిబి తరపు న్యాయవాదులు వాదించారు.

వర్ల పిటిషన్‌పై అత్యవసర విచారణకు నిరాకరణ
విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-అమరావతి: తెలుగుదేశం పార్టీ బ్యాంకు అకౌంట్ల వివరాలు సమర్పించాలని సిఐడి అధికారులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాను కోరడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య హైకోర్టును ఆశ్రయించారు. వర్ల వేసిన రెండు వేర్వేరు వ్యాజ్యాలను అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లను తాను విచారణ చేపట్టబోనని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ శుక్రవారం ప్రకటించారు. మరో బెంచ్ అత్యవసరంగా విచారణ చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని వర్ల న్యాయవాది చేసిన అభ్యర్థనను తోసిపుచ్చారు. అయితే, పిటిషన్లకు నెంబర్ కేటాయించేలా రిజిస్ట్రీకి ఉత్తర్వులు ఇవ్వాలన్న వినతిని ఆమోదించారు.



గోవా శిశువుకు పునరుజ్జీవం

- ఎయిర్ అంబులెన్స్‌లో తరలింపు
- 'రెయిన్‌బో'లో అరుదైన చికిత్స

హైదరాబాద్ : రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు మరో అరుదైన వైద్య చికిత్స చేశారు. దేశంలోనే తొలిసారి ఎక్మోపై ఉన్న అతి తక్కువ వయసు కలిగిన శిశువును వాయు మార్గంలో తరలించి రక్షించారు. తీవ్రమైన న్యూమోనియా, ఎఆర్‌డిఎస్‌తో బాధపడుతూ అత్యున్నత స్థాయి వెంటిలేటర్ మీద ఉన్న గోవాకు చెందిన 18 నెలల పసికందును రక్షించడం ద్వారా తమ అత్యున్నత స్థాయి వైద్య నైపుణ్యం, నిబద్ధతను చాటుకుందని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ చిన్నారిని రక్షించడానికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ అద్భుతమైన టీమ్‌వర్క్, సమన్వయం, నిబద్ధతను ప్రదర్శించిందన్నారు. మన దేశంలో ఒక చిన్నారిని కాపాడటానికి ఈ తరహా వైద్య చొరవ జరగడం ఇదే తొలిసారి అన్నారు. తమకు కాల్ వచ్చిన వెంటనే, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్, ఎక్మో శిక్షణ పొందిన పెర్ఫ్యూషనిస్ట్ శిక్షణ పొందిన ఇంటెన్సివ్ కేర్ నర్సు, బయోమెడికల్ బృందం గోవా వెళ్లి అక్కడి నుంచి ఇక్కడికి చిన్నారిని వాయు మార్గంలో తరలించామ న్నారు. ఎయిర్ అంబులెన్స్ బృందానికి పీడియాట్రిక్ ఇంటెన్సి విస్ట్ డాక్టర్ కపిల్ బి సచానే నేతృత్వం వహించారన్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న చిన్నారిని సురక్షితంగా ఉందని నిర్ధారించడానికి తమ బృందం అవిశ్రాంతంగా పని చేసిందన్నారు. పిల్లల జీవితాలను రక్షించడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ, మారుమూల ప్రాంతాల నుండి కూడా అనారోగ్యంతో ఉన్న రోగులకు వైద్యం అందించడానికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ తీవ్రంగా శ్రమిస్తోందని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిఎండి డాక్టర్ రమేష్ కంచర్ల పేర్కొన్నారు.

ఎపిఎస్‌పి 6వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా మంగళగిరిలోని ఎపిఎస్‌పి 6వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ కెఎస్‌వి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలను ప్రదర్శించి వారితో ఫైరింగ్ ఎలా చేస్తారు అనే అంశాలపై వివరించారు. అలాగే విద్యార్థులతో ఎకె 47 పట్టించి, ఫొటోలు తీసి, వారికి ఉచితంగా అందజేసి, పోలీసు విధులపట్ల ఆసక్తిని పెంచారు. పోలీసులు ఉపయోగించే 303 రకాల తుపాకులు, 7.62 రైఫిల్స్, లోడింగ్ రైఫిల్, పిస్టల్, కార్బైన్, 5.56 ఎంఎం ఇన్సాస్, 7.62 ఎంఎం ఎకె 47, గ్రెనేడ్, టియర్ గ్యాస్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఇఎస్ సాయిప్రసాద్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు : ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవరు రాంసింగ్‌పై భౌతిక దాడికి పాల్పడ్డ దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. విధుల్లో వున్న డ్రైవరుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు నుంచి విజయవాడకు వస్తున్న ఆర్‌టిసి బస్సు డ్రైవరును టిఎన్‌సి9 1612 నెంబరు గల కారు డ్రైవరు, అందులో వున్న వారు దాడి చేశారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : ఎన్‌ఎంయు

డ్రైవరు రాంసింగ్‌పై దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య ఒక ప్రకటన విడుదల చేశారు.

సంపాదకీయం

వలస వేతలు

కర్ణాటకలోని చిక్‌బళ్లాపురం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది వలస కార్మికులు చనిపోవడం దిగ్భ్రాంతికరం. వీరిలో అత్యధికులు శ్రీసత్యసాయి జిల్లాకు చెందినవారే. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావంతో అనేక ప్రాంతాల్లో కరువు నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేకపోవడం, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న దరిమిలా కరువు సీమల నుంచి వలసలు అనివార్యమవుతున్నాయి. పొట్ట చేత పట్టుకొని బతుకుజీవుడా అంటూ పట్టణాలకు వలసపోతున్న అభాగ్యులు ఇలా నడిదారిలో రోడ్డు ప్రమాదాలకో..మరో విపత్తుకో బలైపోతుండటం దయనీయం. కొన్నాళ్ల కిందట ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నఊరిలో పనుల్లేక మరో ప్రాంతానికి వెళ్తూ దారిమధ్యలో విద్యుత్ తీగలు తెగిపడటంతో ఆరుగురు వ్యవసాయ కార్మికులు చనిపోవడం ఎంతటి విషాదాన్ని మిగిల్చిందో చూశాం. రాష్ట్రంలోనే కాదు.. దేశం నలుమూలలా వివిధ ప్రాంతాలకు, గల్ఫ్ లాంటి దేశాలకు వలస వెళ్తూ దారిమధ్యలో అసువులు బాస్తున్న బడుగుజీవులు ఎందరో! కోవిడ్ సమయంలో దారిలో నేలరాలిన శ్రమజీవులెందరో! గ్రామీణ ప్రాంతాల్లోనే ఉపాధి కల్పించి జీవనోపాధులు మెరగుపరిస్తే ప్రజలు ఉన్నచోటే పదిలంగా పనిచేసుకుంటారు. ఇలాంటి విషాద ఉదంతాలు జరిగేవి కాదు.

దేశ స్థూల జాతీయోత్పత్తిలో 10 శాతం వలస కార్మికుల నుంచి లభిస్తోందని అంతర్జాతీయ కార్మికుల సంస్థ (ఐఎల్‌ఓ) నివేదించింది. జాతి నిర్మాణంలో ఇంత పెద్ద వాటా కలిగిన వలస జీవుల బతుకులు మాత్రం గాల్లో దీపాల్లానే ఉన్నాయి. 2011 జనగణన ప్రకారం దేశంలో 121 కోట్ల మంది జనాభా ఉండగా అందులో 45.6 కోట్ల మంది వలస కార్మికులే. మన రాష్ట్రంలో సమారు 30 లక్షల మంది వరకు వలస కార్మికులున్నట్లు అంచనా. ఐక్యరాజ్యసమితి తాజాగా వెలువరించిన గణాంకాల ప్రకారం దేశ జనాభా 142 కోట్లుగా ఉంటే అందులో సుమారు మూడింట రెండింతలు 35 ఏళ్ల లోపు వయస్సున్నవారే. వీరిలో అత్యధిక మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, నగరాలకు వలస వచ్చి శివారు ప్రాంతాల్లో నివసిస్తూ డ్రైవర్లు, హెల్పర్లు, దుకాణాలు, ఇళ్లలో దినసరి కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ బతుకెళ్లదీస్తున్నవారే. సొంతూరిని, అమ్మనాన్నల అనురాగాన్ని, బంధుగణ ఆత్మీయతను కాదని పరాయిచోటుకి ప్రజలు వలసకట్టడానికి రెండు ప్రధానమైన కారణాలు కనిపిస్తాయి. మొదటిది జీవనోపాధి, మెరుగైన కూలిరేట్లు, వేతనాలు. మరొకటి మెరుగైన బతుకు కోసం. వర్షాలు పడక, తినడానికి తిండి లేక, త్రాగడానికి మంచినీరు కొనలేక, వ్యవసాయ పనులు గగనమై, జీవనాధారం కరువై, ఏదైనా పని చేసుకొని బతుకెళ్లదీయొచ్చున్న ఆశతో పల్లె ప్రజ పనులెత్కుంటూ మరోచోటుకి పయనమవుతోంది. ఉన్నచోటే మెరుగైన వేతనాలతో పనులు దొరికితే, తిండి, నీరు సమృద్ధిగా దక్కితే సొంతూరిని వీడే అవసరమే రాదు. ఉన్నచోటే ఉపాధి కల్పించలేని పాలకులకు కనీసం వలస వెళ్తున్నవారికి గుర్తింపు కార్డులివ్వడం, వైద్య సేవలు, బీమా వంటి కనీస సౌకర్యాలు కల్పించడం వంటి సోయి కూడా లేదు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఇందుకు మినహాయింపు. దేశానికే ఆదర్శనీయమైన విధానాలు అమల్జేస్తున్నాయి.

కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వలస కార్మికులను అతిథి కార్మికులుగా గౌరవిస్తోంది. రాష్ట్ర పురోభివృద్ధిలో వలస కార్మికుల కృషి ఎంతో ఉందని కొనియాడుతూ తమిళనాడు ప్రభుత్వం అండదండలందిస్తోంది. వలస కార్మికుల కారిడార్లను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు, వసతి సౌకర్యాలను కల్పించడంతో పాటు కోవిడ్ సమయంలో వలస కార్మికులకు కేరళ అందించిన సహాయాలకు ప్రపంచ నలుమూలాల నుంచి ప్రశంసలు దక్కాయి. కుడుంబ శ్రీ పథకాన్ని అమల్జేస్తున్న కేరళ.. ఉన్నచోటే ఉపాధి కల్పిస్తూ వలసల నివారణకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ సహకరించకపోయినా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమల్జేయడమేగాక పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని కేరళ ప్రభుత్వం దిగ్విజయంగా అమల్జేస్తూ ప్రత్యామ్నాయ దివిటిని వెలిగించింది. చిక్‌బళ్లాపురం వంటి విషాదాంతాలు పునరావృతం కాకూడదనుకుంటే కరువు నివారణ చర్యలను తక్షణమే చేపట్టాలి. గ్రామాల్లో జీవనోపాధులు పెంపొందించేలా కుటీర పరిశ్రమలకు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమివ్వాలి. కేరళ తరహాలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకూ విస్తరింపజేసి కనీసం రూ.600 రోజువారీ వేతనంతో ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలి.

మహనీయుల మాట



ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు. జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణా కాదు. జీవితంలోని ప్రతి కోణాన్నీ చూపించలేనిది సాహిత్యమే కాదు.

- కొడవటిగంటి కుటుంబరావు,
ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది.

జననం : 28.10.1909
మరణం :17.8.1980

విశ్లేషణ

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు



రాష్ట్ర విభజన సందర్భంగా హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా వెంటనే ఇవ్వాలి. దీనివలన రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. వీటితో పాటు విభజన చట్టంలో హామీలను కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా అమలు చేయకుండా ఆంధ్రులకు అన్యాయం చేసింది. పోలవరం నిర్మాణం, రాజధాని నిర్మాణానికి ఆర్థిక సహాయం, 11 జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు, 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రామాయపట్నంలో ఓడరేవు, కడపలో ఉక్కు కర్మాగారం, విశాఖలో రైల్వేజోన్, ఆయిల్ రిఫైనరీ, పారిశ్రామిక కారిడార్ మొదలగు హామీలలో వేటినీ కేంద్రం అమలు చేయలేదు. గత రాష్ట్ర ప్రభుత్వంగాని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంగాని కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయాయి. ఈ పరిస్థితులలో ప్రత్యేక హోదా, విభజన హామీలపై ప్రజాభిప్రాయం, ప్రజా ఒత్తిడి ద్వారా సాధించుకోవలసి ఉన్నది.

అక్టోబర్ 7, 8 తేదీలలో విజయవాడలో సి.పి.యం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై 2 రోజుల సెమినార్ జరిగింది. 8 సెషన్లుగా జరిగిన రెండు రోజుల సెమినార్‌లో సి.పి.యం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, ప్రొఫెసర్ ఎస్.పురేంద్ర ప్రసాద్, ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు, రైతు స్వరాజ్య వేదిక బాలు, 'స్వేచ్ఛ' వై.కిరణ్‌చంద్ర, వి. బాలసుబ్రమణ్యం, రమేష్ పట్నాయక్, ప్రొఫెసర్ సి.రామ చంద్రయ్య, ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి, చలసాని శ్రీనివాస్, పార్టీ నాయకులు పి.మధు, ఎమ్.ఎ.గఫూర్, వి.శ్రీనివాసరావుతో పాటు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు కూడా రిసోర్స్‌పర్సన్లుగా పాల్గొన్నారు.

2014 జూన్ 2న ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగిన తరువాత గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో వివిధ రంగాల పరిస్థితి, రాజధాని, విభజన హామీలు, ప్రత్యేకహోదా, నీటిపారుదల ప్రాజెక్టులు, పునరావాసం మొదలగు అంశాలను సెమినార్‌లో చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం, కౌలురైతులు, పారిశ్రామిక రంగం, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాలు, సామాజిక తరగతులు తదితర అంశాలను చర్చించటమే కాక ప్రత్యామ్నాయ విధానాలను వివరించారు. సెమినార్‌లో చర్చించిన అంశాలు, ప్రత్యామ్నాయ విధానాలు కింది విధంగా ఉన్నాయి.

వ్యవసాయ రంగ సంక్షోభం-రైతు రక్షణ

మొదటి సెషన్ ఛైర్‌పర్సన్‌గా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య వ్యవహరించగా వ్యవసాయ రంగ సంక్షోభం, రైతుల సమస్యలు, కౌలు రైతులపై చర్చ జరిగింది. రైతులకు గిట్టుబాటు ధర లభించాలి. స్వామినాథన్-జయతీ ఘోష్, రాధాకృష్ణన్ కమిటీల సిఫార్సులు అమలు చేయాలి. ప్రతి కౌలురైతుకు గుర్తింపు కార్డు, రుణం గ్యారంటీ ఇవ్వాలి, కౌలురైతులకు భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలి. కౌలు రైతులందరికి భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా, రుణాలు అందించాలి. ప్రతి ఎకరానికి సాగునీరు, మోటార్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి. స్మార్ట్ మీటర్ల విధానం ఉపసంహరించుకోవాలి. భూమి లేని వ్యవసాయ కూలీలకు, కౌలురైతులకు 2 ఎకరాల భూమి ఇవ్వాలి. పరిశ్రమలకు సేకరణ చేసిన భూముల్లో పరిశ్రమలు పెట్టకపోతే, రైతులకు వాపస్ ఇవ్వాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలి. పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం చేయాలి. అసలు పట్టాదారులకే అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలి.

నీటిపారుదల రంగం-భూసేకరణ-పునరావాసం

ఈ సెషన్‌కు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి అధ్యక్షత వహించగా, వి.రాంభూపాల్, మంతెన సీతారాం, రిటైర్డ్ ఇంజనీరు శివరామకృష్ణ రిసోర్స్ పర్సన్లుగా పాల్గొన్నారు. నిర్ణీత కాలపరిమితులో వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులు పూర్తి చేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార, వెలిగొండ ప్రాజెక్టు, హంద్రీ-నీవా, గాలేరు-నగరిలతో పాటు భారీ, మధ్య, చిన్న తరహా నీటిప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికపై పూర్తి చేయటానికి నిధులు కేటాయించాలి. గత నాలుగేళ్లలో ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో 61,573 కోట్లు కేటాయించి, 32,059 కోట్లు మాత్రమే ఖర్చు చేయటం దారుణమైన విషయం. ప్రాజెక్టులకు భూసేకరణలో 2013 భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు జరపాలి. నిర్వాసితుల పునరావాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలి. పోలవరం ప్రాజెక్ట్‌ను విభజన చట్టంలో చెప్పిన విధంగా పూర్తి చేయటానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. కృష్ణానదిలో మన నీటి హక్కులను కాపాడుకోవాలి.

పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి, సేవారంగం

ఈ సెషన్‌కు వి.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా, సిహెచ్ నర్సింగరావు, వై.కిరణ్ చంద్ర రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. రాష్ట్రంలో ఐ.టి, ఫార్మా, జూట్, టెక్స్‌టైల్స్, అగ్రి, సినీ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. విశాఖపట్నంతో పాటు తిరుపతి, విజయవాడ, అనంతపురం, ఒంగోలు మొదలగు ప్రాంతాలలో ఐ.టి పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి. చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పించి వాటి అభివృద్ధికి కృషి జరపాలి. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలి. విభజన చట్టంలో చెప్పిన విధంగా కడపలో భారీ ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి.

అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలి. కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఒ.పి.యస్ పునరుద్ధరించాలి. ప్రైవేటు ఉద్యోగులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పి.ఎఫ్ వంటి భద్రతలు కల్పించాలి. ఖాళీగా ఉన్న 2,50,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి. నిరుద్యోగభృతి రూ.5,000 ఇవ్వాలి.

విద్య ఆరోగ్య రంగాలు

నాల్గవ సెషన్‌కు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించగా వి.బాలసుబ్రమణ్యం, రమేష్ పట్నాయక్, డాక్టర్ ఎం.వి.రమణయ్య రిసోర్స్‌పర్సన్లుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానం -2020ని వ్యతిరేకించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టపరిచే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ఉన్నత విద్యారంగంలో విశ్వవిద్యాలయాలలో అధ్యాపక ఖాళీలన్నింటినీ భర్తీ చేసి, యూనివర్శిటీలను పటిష్ట పరచాలి. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఇతర ప్రైవేట్ విద్యా సంస్థలపై నాణ్యత, ప్రమాణాలతో సహా నియంత్రణ ఉండాలి. 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్సీ ప్రకటించాలి. విద్యార్థులందరికి పూర్తి ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ అమలు పరచాలి.

వైద్య ఆరోగ్య రంగాలకు సంబంధించి సుజాతారావు కమిటీ సిఫార్సులు అమలు పరచాలి. గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి. గిరిజన ప్రాంతాలలో ఆరోగ్య కేంద్రాల స్థాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. టీచింగ్ ఆసుపత్రులన్నింటిలో సూపర్ స్పెషాలిటీ పోస్టులను భర్తీ చేయాలి.

సామాజిక తరగతులు

ఈ సెషన్‌కు కె.లోకనాథం అధ్యక్షత వహించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకట్, డి.రమాదేవి, ఎ.మాల్యాద్రి, కిల్లో సురేంద్ర తదితరులు రిసోర్స్‌పర్సన్లుగా పాల్గొన్నారు.

2024 నుంచే చట్టసభలలో మహిళా రిజర్వేషన్లు అమలు జరగాలి. మహిళల రక్షణ, అభివృద్ధికి కమిషన్ నియమించాలి. మద్యపానంపై నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన జరగాలి. సామాజిక న్యాయం, ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు, కులగణన, వివక్షతపై కఠిన చర్యలు, సబ్‌ప్లాన్ అమలు, దళితులకు రక్షణ, జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సుల అమలు, డప్పు, చర్మ కళాకారులందరికీ పెన్షన్లు అమలు జరగాలి. వృత్తులకు రక్షణ, ఆధునిక పరికరాల సరఫరా, బి.సిలకు సబ్‌ప్లాన్ ప్రత్యేక నిధులు, ఎస్సీ, ఎస్టీ, బి.సి కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధికి రుణాలు, సబ్సిడీలు ఇవ్వాలి. గిరిజనులకు ప్రత్యేక విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక డీఎస్సీ, ఏజన్సీలో జీవో నెం.3 అమలు జరపాలి. మైనారిటీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు, మత సామరస్యం, సచార్ కమిటీ, రంగనాథ మిశ్రా కమిషన్ సిఫార్సులు అమలు జరపాలి. మైనారిటీల కోసం ఉర్దూ పాఠశాలలు నెలకొల్పాలి. వికలాంగుల చట్టానికి రూల్స్ నోటిఫై చేయాలి. ఇతర పెన్షన్లతో సంబంధం లేకుండా వికలాంగులకు నెలవారీ భృతి రూ. 6 వేలు ఇవ్వాలి. పేదలందరికీ 2 సెంట్ల స్థలంతో ఇల్లు, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలి. పేద మహిళలకు ప్రత్యేక సహాయం అందించాలి. అన్ని రకాల పెన్షన్లు రూ. 5 వేలకు పెంచాలి. ఉద్యోగాలలో బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటిని భర్తీ చేయాలి. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వటానికి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి.

ప్రాంతీయ అభివృద్ధి, వెనుకబాటుతనం, రాజధాని

ఈ సెషన్‌కు ఛైర్‌పర్సన్‌గా ఎం.ఏ.గఫూర్ వ్యవహరించగా ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, కె.లోకనాథం రిసోర్స్‌పర్సన్లుగా ఉన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు రూ. లక్ష కోట్లతో ప్యాకేజీ ప్రకటించాలి. విభజన చట్టంలో 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలు జరపాలి. సమాఖ్య విధానాన్ని పరిరక్షించుకుంటూ రాష్ట్రాల హక్కులు కాపాడాలి. అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. రాజధాని, పాలనా రాజధాని అమరావతిలో కొనసాగాలి. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరగాలి. కర్నూలులో హైకోర్ట్, విశాఖపట్నం-విజయవాడలలో హైకోర్టు బెంచీలు ఉండాలి. ఉత్తరాంధ్ర, రాయలసీమలలో నీటిపారుదల, పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయరంగం...అభివృద్ధికి ప్రత్యేక కృషి జరగాలి. ప్రభుత్వాలు అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా ఆలోచించాలి.

స్థానిక సంస్థలు-వికేంద్రీకరణ-సచివాలయాలు

ఈ సెషన్‌కు బి.గంగారావు అధ్యక్షత వహించగా సిహెచ్.బాబూరావు, ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. 73, 74 రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా స్థానిక సంస్థలకు నిధులు-విధులు కేటాయించాలి. గ్రామ, వార్డు సచివాలయాలను స్థానిక సంస్థల పరిధిలోకి తేవాలి. గ్రామీణాభివృద్ధి, పట్టణాల అభివృద్ధికి ఆర్థిక సంఘాల నివేదిక ఆధారంగా నిధులు కేటాయించాలి. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చే నిధులు స్థానిక సంస్థలే ఖర్చు పెట్టుకునే అవకాశం ఇవ్వాలి. స్థానిక సంస్థలను ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేయించాలి. పట్టణ, నగర ప్రాంతాలలో విస్తారమైన ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధిపరచాలి. ప్రజలపై చెత్తపన్ను వంటి అదనపు భారాలు లేకుండా చూడాలి.

విభజన చట్టం-హామీలు

ఈ సెషన్ ఛైర్‌పర్సన్‌గా పి.మధు, రిసోర్స్‌పర్సన్లుగా కె.యస్.లక్ష్మణరావు, చలసాని శ్రీనివాస్ వ్యవహరించారు. రాష్ట్ర విభజన సందర్భంగా హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా వెంటనే ఇవ్వాలి. దీనివలన రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. వీటితో పాటు విభజన చట్టంలో హామీలను కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా అమలు చేయకుండా ఆంధ్రులకు అన్యాయం చేసింది. పోలవరం నిర్మాణం, రాజధాని నిర్మాణానికి ఆర్థిక సహాయం, 11 జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు, 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రామాయపట్నంలో ఓడరేవు, కడపలో ఉక్కు కర్మాగారం, విశాఖలో రైల్వేజోన్, ఆయిల్ రిఫైనరీ, పారిశ్రామిక కారిడార్ మొదలగు హామీలలో వేటినీ కేంద్రం అమలు చేయలేదు. గత రాష్ట్ర ప్రభుత్వంగాని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంగాని కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయాయి. ఈ పరిస్థితులలో ప్రత్యేక హోదా, విభజన హామీలపై ప్రజాభిప్రాయం, ప్రజా ఒత్తిడి ద్వారా సాధించుకోవలసి ఉన్నది.

సి.పి.యం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాల కోసం ఈ సెమినార్ నిర్వహించింది. దీనితోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో, వివిధ రంగాలపై సదస్సులు నిర్వహించింది. వీటి ఆధారంగా 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి కోసం' 3 ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు నిర్వహిస్తున్నది. నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే 'ప్రజా రక్షణ భేరి' ద్వారా ప్రత్యామ్నాయ ప్రజా ప్రణాళికను ప్రజల దగ్గరకు తీసుకువెళ్తున్నది. స్వాగతించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి విజ్ఞప్తి .



కె.యస్.లక్ష్మణరావు,
శాసనమండలి సభ్యులు



వై.రాము
డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు

వ్యాఖ్య


ప్రతిఘటన నిత్యం, సత్యం

ఆదిలో హమాస్ దాడి పట్ల వ్యతిరేకత వ్యక్తమైనా, క్రమేణా ఇజ్రాయిల్ భీకర యుద్ధ దాడుల పట్ల జుగుప్స కలుగుతున్నది. నేతలు ఇంత అమానవీయంగా ఉంటారా! అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అగ్ర దేశాల్లో ఇజ్రాయిల్ సంపన్న యూదుల పెట్టుబడుల దృష్ట్యా ఆ దేశాల మద్దతు తాత్కాలికంగా లభించినప్పటికీ...అంతిమంగా శ్రమించే మానవాళి, మానవత్వమే ప్రపంచ గతికి మూలమని ఈ నేతలు ఎప్పటికి గ్రహిస్తారో.



అణచివేతలు-ఆక్రమణలు ఉన్నప్పుడు తిరుగుబాట్లు -ప్రతిఘటనలు తప్పవు. అవి హింస అయితే ఇవి కూడా హింస అవుతాయి. రాజ్యహింసకు ప్రతిహింస చెలరేగక మానదు. ఆత్మరక్షణా పోరాటం అనేది మానవ స్వభావంలోనే ఉంటుంది. ఒక్కోసారి ఈ దాడులు-ప్రతిదాడులు చినికి చినికి గాలివానగా మారి యుద్ధ రూపాలుగా సంతరించుకుంటాయి కూడా.

అందుకే ఇజ్రాయల్-పాలస్తీనా యుద్ధపోరును తక్షణం భేషరతుగా శాంతింపజేయాలని ప్రపంచ మానవాళి కోరు కుంటున్నది. యుద్ధం జరుగుతున్న వేళ అమాయక ప్రజలు వేలాదిగా ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు గావడం, కొంపా గోడు వదలి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ పారిపోవడం, చూస్తుండగానే కట్టడాలు నేలమట్టం కావడం అంతా క్షణాల్లో జరిగిపోతుంది. ఈ భయంకర విధ్వంసం క్షణక్షణం పెరగడమేకాదు, ఇతర ప్రాంతాలకూ ఈ యుద్ధం విస్తరిస్తుంది. యుద్ధ జ్వాలలు, దావాగ్నిలా మారకముందే ఆర్పడం విచక్షణ అనిపించుకుంటుంది.



కె.శాంతారావు

శవాలపై బొగ్గులు ఏరుకున్న చందంగా కొందరు నేతలు తమ స్వార్థ ప్రయోజనం కోసం ఈ యుద్ధ మంటల్లో సైతం చలి కాచుకోడానికి వెనుకాడరు. అందుకే అన్నాడు మహాకవి శ్రీశ్రీ 'బలవంతులు దుర్బల జాతిని బానిసలను కావించారు. నరహంతకులు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి'.

ఎప్పటికప్పుడు వారు తమ పబ్బం గడుపుకుంటూ మీనమేషాలు లెక్కిస్తుంటారు. ఉగ్రవాదాన్ని కేవలం ఆయుధాలతో అణచి వేయగలమని మూర్ఖత్వంతో వెర్రి ప్రేలాపనలు పేలుతుంటారు. ఉగ్రవాదం పుట్టుకకు, పెరుగుదలకు తామూ పరోక్ష కారకులమన్న విషయమే తెలుసుకోరు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ ఈ విషయంలో సరిగానే స్పందించారు. ఇజ్రాయిల్‌పై పాలస్తీనా ప్రజాపోరు సంస్థ 'హమాస్' దాడి (20 రోజుల క్రితం) ఒక్కసారిగా జరిగింది కాదని, శూన్యం నుండి అకస్మాత్తుగా ఊడిపడిన పిడుగుపాటు అసలేకాదని కుండబద్దలు కొట్టారు. ఐ.రా.స దినోత్సవం సందర్భంగా భద్రతా మండలి మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడుతూ తన ఆవేదనను వెలిబుచ్చారు.

'ఇజ్రాయిల్ ఆక్రమణలతో గత 56 ఏళ్ళుగా పాలస్తీనియన్లు అణచివేతకు గురౌతున్నారు. సెటిల్‌మెంట్లు, దండాలు, భయపెట్టే హింసాత్మక చర్యలతో వారు తమ భూమిని కోల్పోయారు. ఇళ్ళు లేక నిరాశ్రయులయ్యారు. తమ సమస్యకు న్యాయమైన పరిష్కారం లభిస్తుందనే ఆశను వారు కోల్పోయారు. అందుకే హమాస్ దాడులు. అయితే దాడులు పరిష్కారం కాదు. అదే సందర్భంలో హమాస్ దాడులు చేసిందనే పేరుతో పాలస్తీనియన్లను యుద్ధరూపేణా శిక్షించాలని ఇజ్రాయిల్ నేతలు భావించడం సరికాదు. సమర్థనీయం కాదు. తక్షణం యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పండి' అని విజ్ఞప్తి చేశారు. ఇరుదేశాల ఏర్పాటు (ఇజ్రాయిల్-పాలస్తీనా) మాత్రమే సమస్యకు పరిష్కారమని ఆయన సూచించారు.

యూదు వ్యతిరేకతను, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టే స్వమత ఛాందస శక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఉద్బోధించారు. ఇజ్రాయిల్ వారు తమ రక్షణ కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, అదేవిధంగా పాలస్తీనియన్లు తమ స్వతంత్ర దేశ ఆకాంక్షలు నెరవేరేలా హమాస్ ఆచితూచి అడుగేయాలని కోరారు. ఉభయులు అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించి నడుచుకోవాలని, లేని పక్షంలో క్షణక్షణం గాజా పరిస్థితి యుద్ధ ఊబిలో కూరుకు పోతుందని హెచ్చరించారు. యుద్ధం పశ్చిమాసియా అంతటా విస్తరించే పెను ప్రమాదం ఎంతో దూరంలో లేదని, దగ్గర్లోనే పొంచి ఉన్నదని, మరిన్ని ప్రాణాలు బలి కాకముందే మేలుకొమ్మని నేతలకు సూటిగానే చెప్పారు.

గాజాలో పౌరులు, పసిపిల్లలు నేలకొరగడం, కట్టడాలు నేలమట్టం కావడం క్షంతవ్యం కాదని అంటూనే పౌరులను రక్షించడం అంటే యుద్ధ ప్రాంతాలను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు కట్టుబట్టలతో పారిపొమ్మని చెప్పడం కాదని చురక అంటించారు. సరైన ఆశ్రయం, ఆహారం, నీరు, విద్యుత్, మందులు లేకుండా శరణార్థులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కాగా ఆ శరణార్థుల శిబిరాలపై, ఆస్పత్రులపై కూడా బాంబులు వేయడం ఏం యుద్ధ నీతి? ఏం మానవీయత? అని కూడా ఆక్రోశించారు.

బ్రెజిల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఇజ్రాయిల్, పాలస్తీనా మంత్రులతో పాటు అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల మంత్రులు పాల్గొనడం గమనార్హం.

ఈజిప్టు-మధ్యధరా సముద్రం మధ్యన ఉండే పాలస్తీనియన్ల గాజా ప్రాంతం 41 కి.మీ. పొడవు 20 కి.మీ. వెడల్పు గల చిన్న భూభాగం. కేవలం 23 లక్షల జనాభా. ఒంటె-గుడారం కథ మాదిరి యూదులు పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్‌గా ఆక్రమించుకున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. అమెరికా, దాని మిత్రదేశాలు పాలస్తీనాను గుర్తించకుండా కేవలం ఇజ్రాయిల్‌ను మాత్రమే ఒక దేశంగా గుర్తిస్తూ 1948లో ఐక్యరాజ్యసమితిలో ప్రకటన చేయడమే సమస్యకు బీజం. తమ సొంత భూభాగంలోనే తాము పరాయివాళ్ళుగా, పరాధీనులుగా బతకడం ఎంత నరకమో అది అనుభవించేవారికే తెలుస్తుంది. ఇజ్రాయిల్ సైన్యం అవకాశం దొరికినప్పుడల్లా పాలస్తీనియన్లపై ఆంక్షలను, అణచివేతను ప్రయోగించడం పరిపాటైపోయింది. చివరకు గాజా లోని మసీదుకు వెళ్ళాలన్నా ఇజ్రాయిల్ సైన్యం అనుమతి తీసుకోవడం వారికి భరింపరాకున్నది.

కనుకనే దీనిని కేవలం రెండు మతాల మధ్య లేదా రెండు ప్రాంతాల మధ్య జరిగే పైపై ఘర్షణగా చూడరాదని, పాలస్తీనియన్ల భౌగోళిక ఉనికి, అస్తిత్వం, ఆత్మగౌరవం, మానవ హక్కులు మిళితమైన ప్రధాన సమస్యగా పరిగణించాలనేది విశ్లేషకుల భావన. ఎక్కడైనా, ఎప్పుడైనా శాంతి భద్రతలతో జీవించే స్వేచ్ఛే నిజమైన స్వేచ్ఛ.

అయితే ఈ యుద్ధాన్ని వాడుకుని రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యూహమని, అందుకే కాల్పుల విరమణకు ముందుకు రావడం లేదని వారు విమర్శిస్తున్నారు.

అక్టోబరు 7న, ఆకాశ మార్గాన, జల మార్గాన, భూ మార్గాన అకస్మాత్తుగా ఇజ్రాయిల్‌పై హమాస్ ముప్పేట దాడి జరిగింది. అదీ బాంబుల తూటాల వర్షంతో. ఏం జరిగిందో తెలుసుకునేలోపునే జరగాల్సిందంతా జరిగిపోయింది. వందలాదిమంది నేలకొరిగారు. దాదాపు 200 మందిని బందీలుగా హమాస్ పట్టుకుపోయింది.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో నైపుణ్యం ఉండి, పెగాసస్ గూఢచర్యానికి పెట్టని కోటగా నిలిచిన ఇజ్రాయిల్‌కు ఇప్పుడు ఇది మింగుడు పడటం లేదు. ఈ దాడి పట్ల ఇజ్రాయిలే కాదు యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. ఇజ్రాయిల్ పాలకుల నిర్లక్ష్యం, అహంభావమే ఈ దాడికి కారణమని పరిశీలకులు విమర్శిస్తున్నారు.

ఇజ్రాయిల్‌పై ఎప్పటికైనా దాడి చేయాలనే దృఢ సంకల్పంతో హమాస్ ఉన్నది. గాలిగుమ్మటాల సాయంతో ఆకాశమార్గాన వచ్చి, దాడి చేసి బందీలను పట్టుకుపోవాలనే ఎత్తుగడలతో హమాస్ ఉన్నట్టు, అందుకు సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్టు దాదాపు పదేళ్ళ క్రితమే వెబ్‌సైట్‌లో కథనం ప్రచురితమైంది. గతంలోని చిన్నచిన్న దాడులకంటే ఇది అనూహ్యమైన పెద్ద దాడి. లెక్కలేని ఏమరుపాటుతనం తమ పాలకులకు ఎందుకు వచ్చిందని ఇజ్రాయిలీలు ప్రశ్నిస్తున్నారు.

దాడికి ప్రతీకారంగా ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రాంతం గాజాపై యుద్ధం చేస్తుంటే, హమాస్‌కు మద్దతుగా లెబనాన్, సిరియాల హిజ్బుల్లా మిలిటెంట్లు రంగంలోకి వస్తున్నారు. గాజాను పూర్తిగా ఆక్రమించి, హమాస్‌ను కనుమరుగు చేయాలని ఇజ్రాయిల్ భావిస్తుంటే, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు సన్నాయి నొక్కులు నొక్కుతూ వంత పాడుతున్నాయి.

ఇజ్రాయిల్ హెచ్చరికతో ఉత్తర గాజా లోని పదకొండు లక్షల ప్రజానీకం పిల్లా, మేకతో దక్షిణ గాజా వైపు ఆకలి దప్పులతో వలస పోవడం ఈనాటి మహావిషాదం.

ఆదిలో హమాస్ దాడి పట్ల వ్యతిరేకత వ్యక్తమైనా, క్రమేణా ఇజ్రాయిల్ భీకర యుద్ధ దాడుల పట్ల జుగుప్స కలుగుతున్నది. నేతలు ఇంత అమానవీయంగా ఉంటారా! అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అగ్ర దేశాల్లో ఇజ్రాయిల్ సంపన్న యూదుల పెట్టుబడుల దృష్ట్యా ఆ దేశాల మద్దతు తాత్కాలికంగా లభించినప్పటికీ...అంతిమంగా శ్రమించే మానవాళి, మానవత్వమే ప్రపంచ గతికి మూలమని ఈ నేతలు ఎప్పటికి గ్రహిస్తారో.

(వ్యాసకర్త సెల్ : 9959745729)

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఇజ్రాయిల్ తరుపున గూఢచర్యానికి పాల్పడ్డారు

8 మంది భారత నేవీ మాజీ అధికారులపై అభియోగం

న్యూఢిల్లీ : ఖతార్ కోర్టు మరణశిక్ష విధించిన 8 మంది భారత నేవీ మాజీ అధికారులు ఇజ్రాయిల్ తరుపున గూఢచర్యానికి పాల్పడినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక నివేదిక ప్రచురించింది. ఉరిశిక్ష విధించిన భారతీయులు ఇజ్రాయిల్ తరుపున గూఢచర్యానికి పాల్పడ్డారని ఖతార్ అధికారులు వెల్లడించినట్లు రైటర్స్ తన నివేదికలో తెలిపింది. అయితే దీనిని ఇటు భారత్ అధికారులు గానీ, అటు ఖతర్ అధికారులు గానీ ధ్రువీకరించలేదు. భారత నౌకాదళానికి చెందిన ఎనిమిది మంది మాజీ అధికారులకు ఖతార్ కోర్టు గురువారం మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. వీరంతా కొన్ని నెలల నుంచి ఖతార్ అధికారుల నిర్బంధంలో ఉన్నారు. గూఢచార్యం ఆరోపణల పై వీరికి కోర్టు మరణ శిక్ష పడడంపై భారత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దీనిపై న్యాయ పోరాటం సాగిస్తామని విదేశాంగ శాఖ తెలిపింది.

బెంగాల్ మంత్రి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ్ బెంగాల్ అటవీ శాఖ మంత్రి, టిఎంసి నాయకులు జ్యోతిప్రియో మల్లిక్‌ను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అదుపులోకి తీసుకుంది. రేషన్ స్కామ్‌లో 20 గంటలు ప్రశ్నించిన ఇడి తర్వాత శుక్రవారం తెల్లవారుజామున మంత్రిని అరెస్టు చేసింది. జ్యోతిప్రియో మమతా ప్రభుత్వంలో ఆహార మంత్రిగా ఉన్న సమయంలో రేషన్ పంపిణీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మల్లిక్‌కు చెందిన కోల్‌కతాలోని రెండు ఫ్లాట్లలోనూ ఇడి అధికారులు బుధ, గురువారాల్లో సోదాలు నిర్వహించారు.

భారత్-పాక్ దళాల మధ్య 8 గంటల పాటు ఘర్షణ

శ్రీనగర్ : జమ్ములోని అర్నియా సెక్టార్‌లో భారత్-పాకిస్థాన్ దళాల మధ్య సుమారు 8 గంటల పాటు ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణతో సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళనతో గడిపారు. ఈ ఘర్షణలో కానిస్టేబుల్ బసవ రాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయని బిఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు. పాక్ కాల్పుల్లో అర్నియా పట్టణంలో రజినీ దేవి అనే సాధారణ మహిళ గాయపడ్డారని, అంతకు మించిన నష్టం జరగలేదని, అయితే సామగ్రికి నష్టం వాటిల్లిందని తెలిపారు. గురువారం రాత్రి 8 గంటలకు పాకిస్థాన్ వైపు నుంచి కాల్పులు, మోర్టార్ షెల్స్‌తో దాడితో ఈ ఘర్షణ ప్రారంభమైంది. ఈ దాడిలో పౌరుల ఇళ్లు, పంటలు దెబ్బతిన్నాయి.

'రథ్ ప్రభారీ'లపై కేంద్రానికి ఇసి నోటీసులు

- డిసెంబర్ 5 వరకూ నియామకాలు చేపట్టరాదని ఆదేశం

న్యూఢిల్లీ : ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రచారం కోసం ప్రభుత్వాధికారులను 'రథ్ ప్రభారీలు'గా నియమించాలని భావిస్తున్న మోడీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండే నియోజకవర్గాల్లో డిసెంబర్ ఐదవ తేదీ వరకూ ఇలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆదేశించింది. 'ప్రతిపాదిత వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కోసం సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారుల హోదాలో జిల్లా రథ్ ప్రభారీలుగా నియమించాలని అన్ని మంత్రిత్వ శాఖలకు లేఖలు పంపినట్లు మా దృష్టికి వచ్చింది. ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల కోసం కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. నాగాలాండ్ లోని తాపీ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కూడా నోటిఫికేషన్ జారీ అయింది. షెడ్యూల్ ప్రకటించిన అక్టోబర్ 9వ తేదీ నుండి డిసెంబర్ 5వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుంది. కనుక అప్పటి వరకూ నియోజకవర్గాల్లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టరాదని కమిషన్ ఆదేశించింది' అని ఈసీ తన నోటీసులో తెలిపింది. అయితే కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం లేదని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ప్రకటించారు. సీనియర్ ప్రభుత్వాధికారులను 'రథ్ ప్రభారీలు'గా పిలవడం సరికాదని, అందుకే వారిని నోడల్ అధికారులుగా పిలుస్తామని వివరించారు.



వారు నోడల్ అధికారులంటూ కేంద్రం బుకాయింపు

దేశవ్యాప్తంగా కేంద్రం తలపెట్టిన వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమం కోసం ప్రభుత్వాధికారులను రథ్ ప్రభారీలుగా నియమించడంపై తీవ్ర విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై వివరణ ఇచ్చింది. సీనియర్ అధికారులను రథ్ ప్రభారీలు అని పిలవడం సబబు కాదని, వారిని నోడల్ అధికారులుగా పిలుస్తామని తెలిపింది. ప్రభుత్వ విజయాల ప్రచారానికి సీనియర్ అధికారులను వినియోగించుకోవడంపై తొలుత కాంగ్రెస్ స్పందించింది. ఎన్నికలకు ముందు ప్రభుత్వం తరఫున రాజకీయ ప్రచారం చేయాలని అధికారులను ఎలా అడుగుతారంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. వికసిత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 15న 'బిర్సా ముండా జయంతి-జన్ జాతి గౌరవ్ దివస్' సందర్భంగా ప్రారంభిస్తారు. జార్ఖండ్‌లోని కుంతీలో సమాచార, విద్య, కమ్యూనికేషన్ (ఐఈసీ) వాహనాలకు ఆయన పచ్చజెండా ఊపుతారు. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర స్పందిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత కాలం ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టబోమని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. సంకల్ప యాత్రలో భాగంగా 2.6 లక్షల గ్రామ పంచాయతీలు, 3700 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రచారం నిర్వహిస్తారు. ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు క్షేత్ర స్థాయి నిపుణులు ఉంటారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కలుసుకొని, వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. వివిధ పథకాలలో లబ్దిదారులను చేర్చేందుకు అక్కడికక్కడే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తారు.

'ఇండియా' తొలగింపు ప్రతిపాదన ఆమోదయోగ్యం కాదు

- పాఠ్య పుస్తకాల్లో ఎన్‌సిఇఆర్‌టి తీరుపై పినరయి విజయన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాఠ్యపుస్తకాల్లో ఇండియా అనే పదాన్ని 'భారత్'తో భర్తీ చేయాలనే ఎన్‌సిఇఆర్‌టి కమిటీ సిఫార్సులు ఆమోదయోగ్యం కావని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. పాఠశాల పాఠ్యపుస్తకాల్లో ఇండియా అనే పదాన్ని భారత్‌తో భర్తీ చేయాలని ఎన్‌సిఇఆర్‌టికు చెందిన ఒక ప్యానెల్ చేసిన ప్రతిపాదనకు వ్యతిరేకంగా పినరయి విజయన్ స్పందించారు. సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాల్లో దేశం పేరును 'ఇండియా'గా కాకుండా 'భారత్'గా మార్చాలని ఎన్‌సిఇఆర్‌టి నియమించిన సామాజిక శాస్త్ర కమిటీ సిఫార్సు చేసింది. 'రాజ్యాంగం మన దేశాన్ని ఇండియా, భారత్ అని అభివర్ణిస్తుంది. ఇండియా ప్రాతినిధ్యం వహిస్తున్న చేరిక రాజకీయాలకు సంఘ్ పరివార్ భయపడుతోంది. అందులో (సిఫార్సులు) భాగం ఇండియా అనే పదంపై విరక్తి' అని పినరయి విజయన్ అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని అధ్యాయాలను గతంలో మినహాయించడంతో పాటు, ఇండియాకు బదులుగా 'భారత్'ను ఉపయోగించాలనే ప్రతిపాదనను ఖండించారు. 'కొత్త ప్రతిపాదనలు మొఘల్ చరిత్ర, గాంధీ హత్య తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ నిషేధం సహా పాఠశాల పాఠ్యపుస్తకాల నుండి ఏకపక్ష మినహాయింపునకు ఇది కొనసాగింపుగా చూడాలి' అని పినరయి విజయన్ అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా ఉండే వ్యక్తులతో ఉందని, చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. 'సంఘ్‌పరివార్ సృష్టించిన బూటకపు చరిత్రను తెల్లగా మార్చేందుకు పాఠ్యపుస్తకాల కమిటీ ఆసక్తిగా ఉంది. భారతదేశం బహుళత్వం, సహజీవనంపై ఆధారపడి ఉండాలనే ఆలోచనకు సంఘ్ పరివార్ ఎప్పుడూ వ్యతిరేకం. దానికి తాజా ఉదాహరణ ఈ ప్రతిపాదన' అని పినరయి విజయన్ అన్నారు. ఎన్‌సిఇఆర్‌టీ కమిటీ సమర్పించిన 'రాజ్యాంగ విరుద్ధ' ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చైనా మాజీ ప్రధాని లీ కెకియాంగ్ కన్నుమూత



బీజింగ్: చైనా మాజీ ప్రధాని లీ కెకియాంగ్ (68) కన్నుమూశారు. గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున కెకియాంగ్ మృతి చెందినట్లు స్థానిక మీడియా తెలిపింది. 2013 నుంచి మార్చి 2023 వరకు చైనా ప్రధానిగా ఉన్నారు. ప్రస్తుత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఆయన అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఈ ఏడాది మార్చిలో ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన షాంఘైలో విశ్రాంతి తీసుకొంటు న్నారు. పేకింగ్ యూనివర్శిటీలో లీ కెకియాంగ్ ఆర్థికవేత్తగానూ పనిచేశారు. సాధారణంగా సిసిపిలో ఇంజినీర్ల ఆధిపత్యం ఎక్కువ. కానీ, లీ ఆర్థిక వేత్త కావడం గమనార్హం. చైనాలోని అన్హుయి ప్రావిన్స్‌లో గల ఓ కమ్యూనిస్టు పార్టీ అధికారి ఇంట్లో లీ కెకియాంగ్ జన్మించారు. చిన్నతనంలో వ్యవసాయంపై ఆకర్షితులైనా, ఆ తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీలో శక్తిమంతమైన నేతగా ఎదిగారు.

యూనియన్ ఏర్పాటు చేస్తారా?

- 127 మంది కార్మికులను తొలగించిన జపనీస్ ఆటోమొబైల్ కంపెనీ యూనిప్రెస్
- సిఐటియు ఆగ్రహం

చెన్నై : తమిళనాడులోని జపనీస్ ఆటోమొబైల్ విడిభాగాల ఉత్పత్తి సంస్థ యూనిప్రెస్ కార్పొరేషన్ 127 మంది శాశ్వత ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. దీంతో కాంచీపురం జిల్లా ఒరగడమ్‌లోని సిప్‌కాట్‌లో ఉన్న ఫ్యాక్టరీలోకి ఆగస్టు 24 నుంచి 60 రోజులకు పైగా కార్మికులకు ప్రవేశం లభించలేదు. యూనియన్‌ను ఏర్పాటు చేయడమే ఉద్యోగులను తొలగించడానికి కారణం. ఈ సంఘటన పూర్తి వివరాల ప్రకారం సిఐటియు అనుబంధంగా ఉన్న యూనిప్రెస్ ఇండియా తొళిలలార్ సంఘం ఫ్యాక్టరీ వెలుపల యూనియన్ జెండాను ఎగురవేసి ఆగస్టు 23న నేమ్ బోర్డును ఏర్పాటు చేసింది. అయితే, సిప్‌కాట్, యూనిప్రెస్ యాజమాన్యం నేమ్‌ప్లేట్, జెండాను తొలగించింది. ఇది జరిగిన 30 గంటల్లోనే కార్మికులు జెండాను ఎగురవేశారు. ర్యాలీకి పిలుపునిచ్చారు. చేనేత కార్మికులు, ఆటో రిక్షా సంఘాలు కూడా ఇందులో పాల్గొన్నాయి. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎ సౌందరరాజన్ జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి యూనియన్ ఏర్పాటు హక్కును పాటించినందుకు శిక్షగా యూనిప్రెస్ కంపెనీ సదరు ఉద్యోగులకు పనిని నిరాకరించింది.

యూనిప్రెస్ యాజమాన్యం నిర్ణయంపై సిఐటియు స్పందించింది. యూనిప్రెస్ యాజమాన్యం తీరుపై తమిళనాడు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. "కార్మిక శాఖలో చర్చలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా, నైపుణ్యం లేని కార్మికులను పనిలో పెట్టుకుని యూనిప్రెస్ అక్రమ ఉత్పత్తికి పాల్పడుతున్నది" అని సీఐటీయూ ఆరోపించింది.

యూనిప్రెస్ కార్మికులను పనికి రాకుండా ఆపకూడదని రాష్ట్ర కార్మిక శాఖ పేర్కొన్నది. వారు పని చేయడానికి, సాధారణ రాజీ చర్చలలో పాల్గొనడానికి అనుమతించాలని ప్రకటించింది. అయితే సెప్టెంబర్ 27న లేబర్ కమిషనర్ పిలిచిన చర్చల్లో యూనిప్రెస్ పాల్గొనకపోవటం గమనార్హం. యాజమాన్యంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామనీ, అయితే యూనియన్‌ను తుడిచిపెట్టేందుకు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను అంగీకరించలేమని సీఐటీయూ స్పష్టం చేసింది.

ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభం



న్యూఢిల్లీ : 'ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఏడో ఎడిషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సులో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్‌ను 'కాలం చెల్లిన ఫోన్'తో పోల్చుతూ విమర్శలు చేశారు. 2014లోనే ప్రజలు ఆ ఫోన్లను వదిలేసి.. దేశ గతిని మార్చే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారని అన్నారు. 'కాలం చెల్లిన ఫోన్లలో స్తంభించిన స్క్రీన్లపై.. ఎన్నిసార్లు స్వైప్ చేసినా, ఎన్ని బటన్లు నొక్కినా ఫలితం ఉండదు. రీస్టార్ట్ చేసినా, బ్యాటరీకి ఛార్జింగ్ పెట్టినా.. చివరకు బ్యాటరీ మార్చినా ఆ ఫోన్లు పనిచేయవు. గత ప్రభుత్వం కూడా అలాంటి స్థితిలోనే ఉండేది. 2014లోనే ప్రజలు అలాంటి కాలం చెల్లిన ఫోన్లను వదిలించుకున్నారు. ఈ దేశానికి సేవ చేసేందుకు మాకు అవకాశం కల్పించారు. 2014 కేవలం తేదీ మాత్రమే కాదు. అదో పెను మార్పు' అని మోడీ తెలిపారు. అలాగే సాంకేతిక రంగంలో భారత్ సాధించిన విజయాలను ప్రధాని గుర్తుచేశారు. 'భారత్ ఇప్పుడు 6జీ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. బ్రాడ్‌బ్యాండ్ వేగంలో భారత్ గతంలో 118 ర్యాంక్‌లో ఉండగా.. ఇప్పుడు 43వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఇటీవలే గూగుల్.. భారత్‌లో పిక్సెల్ ఫోన్‌ను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. శామ్‌సంగ్ ఫోల్డ్ 5, యాపిల్ ఐఫోన్ 15 ఇప్పటికే దేశంలో తయారవుతున్నాయి' అని చెప్పారు. టెక్ విప్లవంలో యువత పాత్ర కీలకమని అన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతోందని తెలిపారు.

జియో స్పేస్ ఫైబర్ ఆవిష్కరణ

ఈ సదస్సులో ముకేష్ అంబానికి చెందిన రిలయన్స్ జియో దేశంలో తొలి శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రధాని మోడి లాంచనంగా ఆవిష్కరించారు. జియో స్పేస్ ఫైబర్ పేరుతో భారత్‌లో ఇప్పటి వరకు ఇంటర్నెట్ సదుసాయం లేని ప్రాంతాలకు, ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలను చేరువ చేయడానికి జియో ఫైబర్, జియో ఎయిర్ ఫైబర్ వంటి బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో పాటు జియో స్పేస్ ఫైబర్‌ను కూడా ప్రారంభించామని సంస్థ తెలిపింది.

ఈ నెల 31న విచారణకు రాలేను

టిఎంసి ఎంపి మహువా మొయిత్రా

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకొని పార్లమెంటులో ప్రశ్నలు అడిగారని ఆరోపణలు ఎదుర్కొంటున్న టిఎంసి ఎంపి మహువా మొయిత్రా ఈ నెల 31న విచారణకు హాజరు కాలేనని లోక్‌సభ నైతిక విలువల కమిటీకి స్పష్టం చేశారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. కమిటీ విచారణకు హాజరయ్యేందుకు తనకు మరింత సమయం కావాలని లేఖలో కోరారు. తన నియోజకవర్గంలో ఈ నెల 30 నుంచి నవంబరు 4 వరకు ముందుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని, అందువల్ల ఈ నెల 31న కమిటీ విచారణకు హాజరుకాలేనని మొయిత్రా లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో బిజెపి ఎంపి రమేష్ భిధూరీ విజ్ఞప్తి మేరకు లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ విచారణ తేదీని మార్పు చేసిన విషయాన్ని ఆమె లేఖలో ప్రస్తావించారు. అలాగే వ్యాపారవేత్త హీరానందానీని కూడా కమిటీ విచారణకు పిలవాలని, ఆయన నుంచి స్వీకరించినట్లుగా చెబుతున్న బహుమతుల వివరాలను కమిటీకి సమర్పించాలని లేఖలో కోరారు. ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ నాకు సమన్లు ఈ-మెయిల్ చేయడానికి ముందే టీవీల్లో వాటిని ప్రసారం చేశారు. నాపై నమోదైన ఫిర్యాదులు, సుమోటో అఫిడవిట్‌లు మీడియా సంస్థలకు అందాయని లేఖలో తెలిపారు.

45 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

- తుమ్మల, పొంగులేటి, రాజగోపాల్ రెడ్డి తదితరులకు అవకాశం
- ఇప్పటివరకు వంద స్థానాలకు ప్రకటన
- 19 స్థానాలకు పెండింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

45 మందితో తెలంగాణలో కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసింది. అనేక చర్చలు, అనేక భేటీల తరువాత ఎట్టకేలకు శుక్రవారం కాంగ్రెస్ రెండో జాబితాను విడుదల చేసింది. 119 అసెంబ్లీ స్థానాలకు గాను ఈ నెల 15న 55 స్థానాలతో మొదటి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్, శుక్రవారం మరో 45 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు మొత్తం 100 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా 19 స్థానాలకు అభ్యార్థుల ఖరారు పెండింగ్‌లో ఉంది. ఇందులో నాలుగు స్థానాలు వామపక్షాలకు కేటాయించనున్నారు. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే జాబితా ప్రకటించనున్నారు.

రెండో జాబితాలో ఇటీవలి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పాలేరు కేటాయించారు. అలాగే శుక్రవారమే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మునుగోడు కేటాయించారు. ఎల్.బి.నగర్ నుంచి మధుయాష్కీ గౌడ్, జూబ్లీహిల్స్ నుంచి ఇండియా క్రికెట్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి జీ.వి. వెన్నెల (గద్దర్ కుమార్తె), ఖైరతాబాద్ నుంచి పి. విజయారెడ్డి, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ పోటీ చేయనున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో భారీ చేరికలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి పలువురి నాయకులు చేరారు. ఇప్పటికే బిఆర్ఎస్, బిజెపిలకు చెందిన పలువురు నేతలు హస్తం గూటికి చేరారు. తాజాగా మరికొందరు సీనియర్ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో మాజీ ఎంపి, బిజెపి నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నేతి విద్యాసాగర్, కపిలవాయి దిలీప్ కుమార్, టి.సంతోష్‌కుమార్‌తో పాటు పటాన్‌చెరుకు చెందిన బిఆర్ఎస్ నేత నీలం మధు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



ఒపిఎస్ అమలుతో సహా మరో ఐదు హామీలు


- రాజస్థాన్ సిఎం తాజా వాగ్దానాలు

జైపూర్: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ శుక్రవారం మరో ఐదు హామీలు ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే భవిష్యత్తులో ఏ ప్రభుత్వమూ మార్చేందుకు అవకాశం లేకుండా పాత పింఛను విధానాన్ని(ఒపిఎస్) అమలు చేసేలా చట్టం చేస్తామన్నారు. అలాగే, 'గోధన్' పథకం కింద కిలో ఆవుపేడను రూ. 2 చొప్పున కొనుగోలు చేస్తామని, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల ఏర్పాటు, ప్రకృతి వైపరీత్యాల్లో జరిగిన నష్టానికి రూ.15లక్షల బీమా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు తొలి ఏడాది ట్యాబ్ లేదా ల్యాప్‌టాప్ ఇస్తామని వాగ్దానం చేశారు. త్వరలోనే పార్టీ ఎన్నికల ప్రణాళికను ప్రకటిస్తామన్న ఆయన.. అందులో మరిన్ని హామీలు ఉంటాయని స్పష్టంచేశారు. శుక్రవారం జైపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ హామీలు ఇచ్చారు.

ఇటీవల ఝుంఝునులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో దాదాపు 1.05 కోట్ల కుటుంబాలకు రూ.500కు వంటగ్యాస్ సరఫరా చేస్తామని, ప్రతి ఇంట్లో కుటుంబపెద్దగా ఉన్న మహిళకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనంగా ఇస్తామని అశోక్ గెహ్లాత్ ప్రకటించిన విషయం తెలిసిందే.

యుద్ధం కాదది, ఊచకోత

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా వ్యాఖ్య



బ్రసీలియా: బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా మాట్లాడుతూ, గాజాలో జరుగుతున్నది యుద్ధం కాదు, ఊచకోత అని అన్నారు. యూదు దురహంకార ఇజ్రాయిల్ సాగిస్తున్న క్రూరమైన దాడుల్లో ఇప్పటికే 2,000 మంది పిల్లలతో సహా 7వేల మందికి పైగా అమాయక పాలస్తీనా పౌరులు మరణించారని ఆయన అన్నారు. ఇజ్రాయిల్ చర్యలు ఊచకోతతో సమానమని స్పెయిన్ సామాజిక హక్కుల తాత్కాలిక మంత్రి విమర్శించారు. ఇజ్రాయిల్‌పై యూరప్ దేశాలు వెంటనే తమ దౌత్య సంబంధాలను తెగదెంపులు చేసుకుని, ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించాలని ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో అల్ జజీరా గాజా ముఖ్య విలేకరి వయెల్ దాదూ భార్య, కుమారుడు, కుమార్తె చనిపోయినట్లు గాజా టివి న్యూస్ చానెల్ బుధవారం తెలియజేసింది. మరో రెండు గంటల తరువాత దాదూ మనవడు కూడా ఆసుపత్రిలో చనిపోయినట్లు వార్త వచ్చింది. ఇదిలా వుండగా గాజాపై దాడులకు సంబంధించి వార్తల కవరేజిని కుదించుకోమని మీ నిధులతో నడుస్తున్న అల్ జజీరాపై ఒత్తిడి పెంచాలని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఖతార్ ప్రభుత్వాన్ని కోరినట్లు అనధికారిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇజ్రాయిల్‌లోని అల్‌జజీరా కార్యాలయాన్ని మూసేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇజ్రాయిలీ కమ్యూనికేషన్స్ మంత్రి ష్లోమా కర్హి తెలిపారు.

గడ్డాలు, టోపీలు ఉన్నవారిని కనిపిస్తే కొడతాం

- జార్ఖండ్ బిజెపి ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : గడ్డం, టోపీ పెట్టుకున్నవారు, గొడ్డు మాంసం తిన్నవారు హిందూ మత స్థలాల దగ్గర కనిపిస్తే దాడులు చేస్తామని జార్ఖండ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. ఒక వర్గం వారిని ఉద్దేశిస్తూ పరోక్షంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే కుష్వాహా శశి భూషణ్ మెహతా చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇది వివాదంగా మారింది.

వార్తా కథనాల ప్రకారం.. విజయ దశమి నాడు జరిగిన కార్యక్రమంలో పలమావు జిల్లాలోని పంకి నియోజకవర్గ ఎమ్మెల్యే మెహతా పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ముస్లింల పేర్లను స్పష్టంగా చెప్పనప్పటికీ "ఈ వ్యక్తులు" మొదట హిందూ మతపరమైన కార్యక్రమాలలో పాల్గొంటారనీ, ఆపై వాటికి అంతరాయం కలిగిస్తారని అన్నారు. అయితే, ఆయన చేసిన ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో మెహతాపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవటం గమనార్హం. "మేము వీడియోను పరిశీలిస్తున్నాం. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయనందున ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు" అని పలామావు పోలీసు సూపరింటెండెంట్ రీష్మా రమేసన్ అన్నారు. వీడియోను పరిశీలించిన తర్వాతే మేము చర్య తీసుకుంటామని తెలిపారు. కాగా, జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్ పార్టీలు రెండూ మెహతా ప్రకటనలను ఖండించాయి.

'అక్బర్' వ్యాఖ్యలపై అస్సాం సిఎంకు ఇసి షోకాజ్ నోటీస్

- 30న హాజరు కావాలని పిలుపు

గౌహతి : అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్నికల ప్రచార సభలో చేసిన 'అక్బర్' వ్యాఖ్యలపై ముఖ్యమంత్రికి ఇసి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 18న శర్మ చేసిన ప్రసంగాన్ని చూసినట్లైతే ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు తేలుతోందని ఇసి పేర్కొంది. ఈ నెల 30వ తేదీన సాయంత్రం 5గంటల్లోగా తమ ముందు హాజరు కావాల్సిందిగా శర్మను కోరింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు మీపై ఎందుకు చర్య తీసుకోరాదో తెలియచేయాలని కోరింది. శర్మ హాజరు కాని పక్షంలో ఇసి సముచితమైన నిర్ణయం లేదా చర్య తీసుకుంటుందని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధాలో హిమంత బిశ్వాస్ శర్మ తన ప్రసంగంలో, అక్బర్‌ను పంపకపోతే మాత కౌసల్య భూమి అపవిత్రం అవుతుంది అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "ఒక అక్బర్ ఎక్కడికైనా వస్తే, అతను 100 మంది అక్బర్లను పిలుస్తాడు. కాబట్టి వీలైనంత త్వరగా అతన్ని పంపించి వేయండి, లేకపోతే మాత కౌసల్య భూమి అపవిత్రమవుతుంది, "అని అతను చెప్పాడు. రాముని తల్లి అయిన మాతా కౌశల్య ఆధునిక ఛత్తీస్‌గఢ్‌కు చెందినదని హిందువులు నమ్ముతారు.

హిమంత బిశ్వాస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బిజెపిల మధ్య మాటల యుద్ధం రేగింది. శర్మ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ గురువారం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ వ్యాఖ్యలు చేయడం ద్వారా శర్మ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించింది. కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెడుతూ ఈ విషయం తెలియచేశారు. ఇసిఐ దీనిపై చర్య తీసుకోగలదని భావిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ నేతలు, ముఖ్యంగా రాజ్యాంగ పదవుల్లో వున్నవారు ఎన్నికల నిబంధనలను ఇలా అతిక్రమించడానికి అనుమతించరాదని అన్నారు.

దీనిపై అస్సాం సిఎం స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కవార్ధ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పేరు మహ్మద్ అక్బర్ అన్న సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియచేయకుండా కాంగ్రెస్ దాచిపెట్టిందని విమర్శించారు. ఒక అభ్యర్థిని చట్టబద్ధంగా విమర్శించడమనేది మతోన్మాద రాజకీయాల కిందకు రాదన్నారు. ఇంతటి కీలకమైన వాస్తవాన్ని దాచిపెట్టినందుకు కాంగ్రెస్ చట్టపరమైన పర్యవసానాలు ఎదుర్కొనాల్సి వుంటుందన్నారు. ఎన్నికల కమిషన్ విజ్ఞతకే ఈ విషయాన్ని వదిలివేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తర గాజాలో మారణహోమం

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా సన్నాహాల్లో భాగమే ఈ దాడి అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇరాన్, సిరియాలపై యుద్ధానికి దిగడం ద్వారా రష్యా ,చైనాలకు హెచ్చరిక పంపాలన్నది అమెరికా పన్నాగం.

ఇజ్రాయిల్ విచక్షణారహితంగా సాగిస్తున్న దాడుల్లో ఇప్పటికే 7వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృతిచెందారు. గురువారం మరణించిన వారి పేర్లు, ఐడి నెంబర్లతో ఒక జాబితాను పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 2,900మంది మైనర్లు కాగా, 1500మందికి పైగా మహిళలు వున్నారు. గతంలో ఇజ్రాయిల్, హమాస్ మధ్య సాగిన ఘర్షణలు, యుద్ధాల్లో మరణించిన వారి కన్నా ఈసారి ఎక్కువమంది మరణించారు. ఇప్పటికే 10లక్షల మందికి పైగా తమ ఇళ్లను వీడి వెళ్లిపోయారు. వీరిలో కొంత మంది ఐరాస సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

భద్రతామండలిలో ప్రతిష్టంభన

ఇజ్రాయిల్, హమాస్ కాల్పుల విరమణ పాటించాలని బుధవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తెచ్చిన తీర్మానానికి అనుకూలంగా రష్యా, చైనా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గాబన్ దేశాలు ఓటు వేశాయి. అమెరికా, బ్రిటన్ వ్యతిరేకించాయి. మండలిలోని మరో తొమ్మిది దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇంధనం, ఆహారం, మందుల కొరతతో మానవతా సంక్షోభం తీవ్ర రూపం దాల్చిన గాజాకు పౌర సరఫరాలు అందేలా చూసేందుకు కాల్పుల విరమణ పాటించాలని రష్యా, చైనా ఆ తీర్మానంలో నొక్కి చెప్పాయి. కాల్పుల విరమణకు బదులు దాడికి దాడికి మధ్య కొద్ది సేపు విరామం (పాజ్) ఇవ్వాలని అమెరికా, దాని మిత్ర దేశాలు అభిప్రాయపడ్డాయి. అవి దీనికి అనుగుణంగా ఒక తీర్మానాన్ని తెచ్చాయి. . అయితే ఆ తీర్మానంలో కాల్పుల విరమణ గురించి కానీ, ఇజ్రాయిల్ భూ ఆక్రమణ గురించి కానీ ఎక్కడా ఒక్క ముక్క కూడా లేదు. ఇది తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రష్యా, చైనా దానిని వీటో చేశాయి. శాశ్వత కాల్పుల విరమణ తప్ప మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని అవి తేల్చి చెప్పాయి. ఈ రెండు తీర్మానాలు భద్రతామండలిలో తిరస్కరణకు గురవడంతో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు మండలికి ఎన్నికైన పది సభ్య దేశాలు కొత్త ఫార్ములాను రూపొందించే పనిలో ఉన్నాయి.

చైనా రోదసీ స్టేషన్‌లో చారిత్రక ఘట్టం !

- రెండు అంతరిక్ష నౌకల సిబ్బంది కలయిక

బీజింగ్ : చైనా మొదటి మానవ సహిత రోదసీ ప్రయాణానికి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా రోదసీ స్టేషన్ తియాంగాంగ్ ఒక చారిత్రక ఘట్టానికి కేంద్రమైంది. షెంఝూ-16, షెంఝూ-17 అంతరిక్ష నౌకలకు చెందిన ఆరుగురు వ్యోమగాములు అంతరిక్ష కేంద్రంలో కలుసుకున్నారు. గురువారం ఉదయం 11.14 గంటలకు షెంఝూ-17 రోదసీ నౌకను విజయవంతంగా నింగిలోకి ప్రయోగించారు. ఆరున్నర గంటల తర్వాత సాయంత్రం 5.46గంటల సమయంలో తియాన్హె రోదసీ స్టేషన్ కోర్ మాడ్యూల్‌తో షెంఝూ-17 రోదసీ నౌక అనుసంధానమైంది. రాత్రి 7.34గంటల సమయంలో షెంఝూ-16 సిబ్బంది రోదసీ నౌక తలుపు తెరిచి షెంఝూ-17 వ్యోమగాములను లోపలకు ఆహ్వానించారు. అనంతరం ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆరుగురు కలిసి ఒక ఫోటో దిగారు. వీరందరూ కలిసి కక్ష్యలో భ్రమిస్తూ దాదాపు నాలుగు రోజుల పాటు చైనా రోదసీ స్టేషన్‌లో కలిసి పనిచేస్తారని సిఎంఎస్ఎ (చైనా మాన్డ్ స్పేస్ ఏజెన్సీ) తెలిపింది. రెండు రోదసీ నౌకల సిబ్బంది మధ్య ఈ సహకారం చైనా రోదసీ అన్వేషణలో గుర్తించదగ్గ చర్య కాగలదని వారు వ్యాఖ్యానించారు. రోదసీలో సుదీర్ఘకాలం నివాసం వుండే సామర్థ్యాన్ని, నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని వారు పేర్కొన్నారు.

పసుపు గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)

ఖరారుచేసిన ధరలను ప్రామాణికంగా తీసుకుని మార్కెఫెడ్ నుంచి 1705 బాయిలర్లు, 840 పాలిషర్ల కొనుగోళ్లకు సిద్ధపడ్డారు. ఒక్కో బాయిలర్‌ను రూ.64,990, పాలిషర్‌ను రూ.74,499 చొప్పున కొనుగోలు చేయడానికి ప్రతిపాదించారు. 2020లో సీతంపేట ఐటిడిఎ అధికారులు ఒక్కో బాయిలర్‌ను రూ.29,500, పాలిషర్‌ను రూ.32,500కు కొనుగోలు చేశారు. ఇదే విషయాన్ని ట్రైకార్ అధికారులు నివేదికలో ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో తక్షణమే రద్దు చేసుకోవాలని ట్రైకార్ సూచించినట్లు తెలిసింది. దీనివల్ల రూ.7 కోట్ల నుంచి రూ.9 కోట్ల మేర పాడేరు ఐటిడిఎకు మిగిలే అవకాశం ఉందని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సూచనపై కూడా అధికార యంత్రాంగం ఇంతవరకు స్పందించలేదు.

ఏమిటీ ప్రాజెక్టు?

గిరిజనులకు జీవనోపాధి కల్పించేందుకు స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్ స్కీమ్ కింద పాడేరు ప్రాంతంలో 2019-20లో పసుపు ప్రాజెక్టును పాడేరు ఐటిడిఎ చేపట్టింది. ఐదు వేల మంది గిరిజన రైతులతో ఐదు వేల ఎకరాల్లో సాగు చేయాలనే లక్ష్యంతో దీనికి శ్రీకారం చుట్టారు. మూడేళ్ల పాటు అమలు చేసే ఈ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.84.76 కోట్లు ఖర్చు చేస్తాయి. సీడ్ కొనుగోలుతోపాటు డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ ఇంజన్లు, మినీ బాయిలర్స్, మినీ పోలీషర్స్, ఆర్గానిక్ సర్టిఫికేషన్, ప్రాజెక్టు మేనేజ్ తదితర కాంపోనెంట్స్ అందజేయాలని నిర్ణయించారు.






మీకోసం

రాళ్ల ఉప్పు, పంచదార, నిమ్మరసం, మిరియాలు వేసి మిశ్రమంలా చేసుకుని ప్రతిరోజూ రెండు స్పూన్లు తీసుకుంటే శ్లేష్మం, దగ్గు సమస్యలు పోతాయి.

జీవన సౌరభం

వినడానికి కటువుగా ఉన్నా, నీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలే తీసుకో.

మొహమాటం




రాము ఆరవ తరగతి చదువుతున్నాడు. పాటలు చాలా బాగా పాడతాడు. కానీ మొహమాటం ఎక్కువ. రాము పాడుతాడన్న సంగతి క్లాసులో ఎవరికీ తెలియదు. ఒకసారి రాఘవయ్య మాస్టారు రాము ఇంటివైపు ఏదో పనిమీద వెళ్లారు. అప్పుడు రాము వాళ్ల ఇంటి నుంచి ఒక పాట వినిపించింది. ఆయన అక్కడే ఆగి, ఆ శ్రావ్యమైన గొంతుకు ముగ్ధులైపోయారు. రాము పాడుతున్నాడని అతని తండ్రి ద్వారా తెలుసుకొన్నారు. అయితే 'నేను విన్న సంగతి మీ అబ్బాయికి చెప్పకండి' అని చెప్పి మాస్టారు వెళ్లిపోయారు.

మరుసటి రోజు రాఘవయ్య మాస్టారు పిల్లలతో 'పిల్లలూ! ఈరోజు మీరందరూ పాటలు పాడాలి' అని అన్నారు. కొందరు పిల్లలు ఉత్సాహంగా వచ్చి పాటలు పాడారు. తరగతిలోని పిల్లలందరూ చప్పట్లతో వారిని అభినందించారు. కానీ రాము మాత్రం పాడటానికి ముందుకు రాలేదు. అప్పుడు మాస్టారు 'ఏం రామూ! నీకు పాటలు పాడటం రాదా!' అని అడిగారు. రాముకు మనసులో పాడాలని ఉంది. కానీ మొహమాటంతో 'రావు సార్' అని అబద్ధం చెప్పాడు. అప్పుడు మాస్టారు 'చూడు రామూ! చాలామంది పిల్లలు పాడారు. నీకు వచ్చింది పాడు. ఇక్కడ నిన్ను హేళన చేసేవారు ఎవరూ లేరు' అన్నారు. మాస్టారు ఇచ్చిన ధైర్యంతో రాము పాట పాడాడు. రాము పాట విని మాస్టారుతో పాటు పిల్లలంతా గట్టిగా చప్పట్లు కొట్టారు.

'రామూ! నీకు వచ్చిన కళను దాచవద్దు. నువ్వు ఎంతో అద్భుతంగా పాడావు. నీ పాట విని నీ మిత్రులు చూడు నిన్ను ఎంతో మెచ్చుకున్నారు. బిడియం వీడి, సాధన చెయ్యి. భవిష్యత్తులో గొప్ప గాయకుడవు అవుతావు' అని మాస్టారు అన్నారు.

'మాస్టారూ! మీరు నాలో ఉన్న భయం పోగొట్టారు. ఇకనుండి నేను మొహమాట పడను. ఎప్పుడు పాడమన్నా పాడతాను. మీరన్నట్లు గొప్ప గాయకుడిని అవుతాను' అని రాము అన్నాడు. రాములో వచ్చిన మార్పుకు మాస్టారు ఎంతో సంతోషించారు.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి, 99085 54535



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



వజ్రాల సుమశ్రీ
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
బుదవాడ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఛీత్కారాలను విసిరికొట్టిన గట్టి మనిషి

మరుగుజ్జుతనాన్ని జయించి, దేశకీర్తిని ఉన్నతంగా చాటాడు. ఆర్థిక కష్టాలు ప్రతిబంధకంగా మారినా వాటినీ సంకల్పబలంతో తిప్పికొట్టాడు. చిన్నప్పటి నుంచీ ఉన్న క్రీడాసక్తికి కఠోర శ్రమ, మెళకువలను జోడించి విజయాల బాట పట్టాడు. వెరసి అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఏకంగా మూడు క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నాడు. బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ప్రత్యర్థులను మట్టికరిపించిన గట్టి మనిషిగా నిలుస్తున్నాడు. అతడే అనకాపల్లి జిల్లాకు చెందిన రొంగలి రవి. ప్రస్తుతం చైనాలో జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో షాట్‌పుట్‌లో రజత పతకం గెలిచి మరోసారి దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేశాడు. అయితే, రవి క్రీడా ప్రస్థానమేమీ అంత సులువుగా సాగలేదు. అనేక ఒడిదుడుకుల నడుమ సాగిన ఆయన క్రీడా జీవితం పలువురికి ఆదర్శం.

రవిది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, చిరికివానిపాలెం గ్రామం. తల్లిదండ్రులు దేముడుబాబు, మంగ. వ్యవసాయమే జీవనాధారం. రవి ఒకటి నుంచి పదో తరగతి వరకూ విశాఖ జిల్లా భీమిలిలోని రెసిడెన్షియల్ స్కూలులో చదువుకున్నాడు. ఇంటర్‌ను ఎస్.కోటకు సమీపంలోని పుణ్యగిరిలోనూ, డిగ్రీని విశాఖ ఎన్‌ఎడి జంక్షన్‌కు సమీపంలోని మహతి డిగ్రీ కళాశాలలోనూ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచీ రవికి క్రీడలంటే ఇష్టం. అన్ని అవయవాలూ సక్రమంగా ఉన్న వారితోనే అతను తలపడుతూ మండల, జిల్లా స్థాయిల్లో గెలుపునందుకుంటూ వచ్చాడు. ఇంటర్‌లో ఉన్నప్పుడు వికలాంగుల కోసం జరిగే పారా గేమ్స్ గురించి తెలుసుకున్నాడు. 2014 నుంచి పారా క్రీడలపై దృష్టి పెట్టాడు. తొలుత బ్యాడ్మింటన్‌పై పట్టు సాధించి పతకాల వేట మొదలుపెట్టాడు. పారా నేషనల్ స్పోర్ట్స్‌లో 2015లో డబుల్స్‌లో రజతం, సింగిల్స్‌లో కాంస్యం, 2016లో డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో రజత పతకాలు, 2017లో డబుల్స్‌లో రజత పతకం సాధించాడు. ఆర్థిక పరిస్థితులు అతనికి సహకరించలేదు. స్పాన్సర్లూ దొరకలేదు. బ్యాడ్మింటన్ శిక్షణ అధిక ఖర్చుతో కూడుకున్నది కావడంతో రవికి ఇబ్బందులు తప్పలేదు. ఈ క్రమంలోనే పారా అథ్లెటిక్స్‌పై దృష్టి పెట్టాడు. షాట్‌పుట్, జావెలిన్ త్రోలో తక్కువ కాలంలోనే పట్టు సాధించి మెరికలాంటి క్రీడాకారునిగా తయారయ్యాడు. అతనికి కుటుంబ సహకారమూ



తోడైంది. కుమారున్ని ఎలాగైనా మంచి క్రీడాకారునిగా చూడాలన్న తలంపుతో తల్లిదండ్రులు తమకున్న కొద్దిపాటి పొలాన్ని అమ్మేసి వచ్చిన డబ్బుతో క్రీడా శిక్షణ ఇప్పించారు. టోర్నీలకు పంపించారు. తన కుటుంబం తన కోసం ఇంత చేస్తున్నందున ఎలాగైనా తనవారికీ, దేశానికీ పేరు తేవాలని రవి సంకల్పించి తన ప్రతిభకు మరింత పదునుపెట్టాడు. అతనికి పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, వి.రామస్వామి అన్ని విధాలా అండగా నిలిచారు.

పతకాల పంట

2017లో హర్యానాలో జరిగిన 18వ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో షాట్‌పుట్‌లో రవి బంగారు పతకం సాధించాడు. 2018లో బెంగళూరులో జరిగిన ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, జావెలిన్ త్రో రెండింట్లోనూ పాల్గొని రెండింటా గోల్డ్ మెడల్ ఒడిసిపట్టాడు. ఈ క్రమంలోనే రవిని అంతర్జాతీయ మ్యాచ్‌లకు పంపించేందుకు అతని కుటుంబం పొలాన్ని అమ్మేసింది. తనకు ఎంతో కొంత ఊత దొరికిందన్న భరోసాతో ముందుకెళుతున్న రవికి కోవిడ్ విపత్కర కాలం మరో సవాలు విసిరింది. రెండేళ్లపాటు దేశంలో ఎక్కడా పారా క్రీడలు జరగలేదు. దీంతో అతనిలో ఆందోళన మొదలైంది.

ఈలోగా కోవిడ్ పరిస్థితులు ఒక్కొక్కటిగా తొలగిపోయి మునుపటి వాతావరణం రావడంతో 2021లో మళ్లీ క్రీడలవైపు రవి తన దృష్టిని మరల్చాడు. 2021లో ముంబయిలో జరిగిన ఫజా పారా ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని రాణించాడు. 2022లో పోర్చుగల్‌లో జరిగిన ఐవజ్ వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో జావెలిన్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో పాల్గొని రెండింటా రజత పతకాలు సాధించాడు. 2023 జూన్‌లో పారిస్‌లో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లోనూ రాణించాడు. పారా ఆసియా క్రీడలకు దేశం నుంచి ఎంపికయ్యాడు.





తాజాగా చైనాలో జరుగుతున్న పారా ఆసియా గేమ్స్‌లో షాట్‌పుట్ ఎఫ్ - 40 విభాగంలో 9.92 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని అందుకున్నాడు. అతనికి ఇరాన్, ఇరాక్, చైనా, సింగపూర్, శ్రీలంక క్రీడాకారుల నుంచి గట్టి పోటీ ఎదురైనా తీవ్ర ఒత్తిడిని జయించి దేశానికి పతకాన్ని అందించాడు. అతన్ని దేశ ప్రధాని మోడీ సహా పలువురు ప్రముఖులు ట్విట్టర్, సోషల్ మీడియా వేదికలుగా అభినందించారు. రవి తొలినాళ్లలో తన మరుగుజ్జుతనం వల్ల వివక్ష ఎదుర్కొన్నాడు. ఛీత్కారాలను చవిచూశాడు. వాటన్నింటినీ తొక్కుకుంటూ వెళ్లి నిరంతర శ్రమ, పట్టుదలతో పైకి ఎదిగాడు. ఇప్పటి వరకూ ఎనిమిది అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని నాలుగు పతకాలు సాధించాడు. మిగతావాటిలో తృటిలో పతకాన్ని చేజార్చుకున్నాడు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

27 ఏళ్ల రవి ప్రస్తుతం బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నడుస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరంలో నిరంతర సాధన చేస్తున్నాడు. అతనికి ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పరంగానూ సాయం అందుతోంది. స్పోర్ట్స్ కోటాలో ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగమూ వచ్చింది. తనలాగే ఎంతోమంది పేద క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారని, వారంతా కష్టాలను జయించి, వైకల్యాన్ని అధిగమించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రవి ఆకాంక్షిస్తున్నాడు. క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సాయం అందించాలని కోరుతున్నాడు. వికలాంగ క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ఉద్యోగావకాశాలు కల్పించాలని విన్నవిస్తున్నాడు. 2024 పారా ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నట్టు రవి 'ప్రజాశక్తి'కి తెలిపాడు.

- కోడూరు అప్పలనాయుడు,
94915 70765

పేదలపై అధికారుల కర్కశం

- పెనుకొండలో 189 గుడిసెల తొలగింపు
- బయటపడేసిన సామగ్రికి నిప్పు
- వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల అరెస్టు, విడుదల



జెసిబితో గుడిసెలు తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -పెనుకొండ (అనంతపురం జిల్లా)

పేదలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రతాపం చూపారు. నిస్సహాయులను చేసి వారి గుడిసెలను తొలగించారు. గుడిసెల్లో ఉన్న సామగ్రిని ఒక చోట వేసి తగలబెట్టారు. అధికారుల చర్యలను అడ్డుకోబోయిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను అరెస్టుచేశారు. అనంతపురం జిల్లా పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వేసుకున్న 189 గుడిసెలను రెవెన్యూ అధికారులు, పోలీసులు శుక్రవారం తొలగించారు. గుడిసెల తొలగింపును అడ్డుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు తదితరులను అరెస్టు చేసి పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు సిపిఎం నాయకులు హరిని ఆయన ఇంటి వద్దే అరెస్టు చేశారు. వారందరినీ సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు. తాము ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించారని పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే అధికారులు కక్షగట్టి వాటిని తొలగించడం దారుణమన్నారు. తమకు నిలువనీడ లేకుండా చేసిన అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ తేల్చి చెప్పారు.

పేదల గుడిసెల తొలగింపునకు నిరసనగా రాస్తారోకో

పేదల గుడిసెల తొలగింపును నిరసిస్తూ సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు, పేదలు పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లో వద్ద మానవహారం నిర్వహించి రాస్తారోకో చేశారు. అధికారులు, పోలీసుల తీరును ఖండించారు. ఈ ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను బలవంతంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా మహిళలు అడ్డుపడ్డారు. ఈ క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ స్పృహ కోల్పోయి కిందపడిపోయారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు రమణకు స్వల్ప గాయం కావడంతో ఆయననూ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, సోమందేపల్లి సిపిఎం నాయకులు వెంకటేష్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడంతో సిపిఎం నాయకులు, మహిళలు స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం వారికి అండగా ఉంటుందని నాయకులు చెప్పారు.

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు

- ప్రతి పేదవాడికీ సంక్షేమాన్ని చేరువ చేశాం
- వైసిపి బస్సు యాత్రలో నేతలు



తిరుపతి బహిరంగ సభలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి



విజయనగరం బహిరంగ సభలో మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్య, వైద్యం, వ్యవసాయ రంగంలో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రతీ వ్యక్తికి సంక్షేమాన్ని చేరువ చేశారని పలువురు వైసిపి నేతలు అన్నారు..బస్సు యాత్ర రెండోరోజూ తిరుపతి, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొనసాగింది. ఆయా చోట్ల నిర్వహించిన సభల్లో మంత్రులు మాట్లాడారు.

విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. చంద్రబాబు హామీలు అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. మన జీవితాలు, సామాజిక పరిస్థితులు ఎలా మారాయనేది చూడాలని, జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పీడిక రాజన్నదొర మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడంలో సిఎం ముందంజలో ఉన్నారని తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. 'చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా చేతులెత్తేశాడు. అందుకే చిత్తుగా ఓడిపోయాడు'. అని విమర్శించారు. బూడి ముత్యాలనాయుడు తదితరులు మాట్లాడారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సభలో మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ... చంద్రబాబు పాలనలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు దక్కని గౌరవం జగన్ హయాంలో దక్కిందన్నారు. మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ... ప్రతీ సామాజిక వర్గానికి ఒక ప్రతినిధి ఉండాలని వివిధ కార్పొరేషన్లలోనూ ప్రభుత్వ పదవుల్లోనూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు సమపాళ్లలో ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడారు.

తిరుపతిలో సభనుద్దేశించి మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాజ్యాధికారం ద్వారానే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని భావించి వారికి పదవులు ఇచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. ఎంపి గురుమూర్తి, తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

జాతీయ రహదారిపై టిడిపి శ్రేణుల బైఠాయింపు

విజయనగరం నుంచి గజపతినగరం వెళ్తున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడును బొండపల్లి పోలీసుస్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. వైసిపి బస్సుయాత్ర నేపథ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో టిడిపి శ్రేణులంతా స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించారు. వైసిపి తీరుకు నిరసనగా నినాదాలు చేశారు.

ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా గెలుపు

- మార్క్‌క్రమ్ ఒంటరి పోరాటం
- పాకిస్తాన్ సెమీస్ ఆశలు ఆవిరి



ఓటమితో సమీకరణాలపై సమాలోచన చేస్తున్న కెప్టెన్ బాబర్

చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్ సెమీస్ రేసునుంచి పాకిస్తాన్ దూరమైంది. సెమీస్ రేసులో నిలవాలంటే దక్షిణాఫ్రికాపై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు వికెట్ తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 46.4ఓవర్లలో 270పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 47.2ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 271పరుగులు చేసి విజయం సాధించింది. ఈ గెలుపులో దక్షిణాఫ్రికా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. తొలుత కెప్టెన్ బాబర్ అజామ్(50), సౌద్ షకీల్(52) మాత్రమే అర్థ శతకాలతో రాణించారు. షాదాబ్ ఖాన్(43) ఫర్వాలేదనిపించాడు. తొలుత ఓపెనర్లు అబ్దుల్లా షఫీక్(9), ఇమామ్ అల్ హక్(12) శుభారంభం అందించలేకపోయారు. వీరిద్దరినీ జెన్సన్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత బాబర్, మహ్మద్ రిజ్వాన్ (31) మధ్య చక్కటి పార్ట్‌నర్ షిప్ దొరికింది. జట్టు స్కోరు 86 పరుగుల వద్ద రిజ్వాన్‌ను కొయిట్జీ బోల్తాకొట్టించి పెవిలియన్‌కు పంపాడు. ఇఫ్తికార్ అహ్మద్ (21)తో కలసి బాబర్ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. వీరి భాగస్వామ్యం భారీ స్కోరువైపు వెళ్తోంది అనుకునేలోపే 12 పరుగుల తేడాతో ఇద్దరూ పెవిలియన్‌కు చేరారు. ఈ రెండు వికెట్లు షంసీ ఖాతాలో చేరాయి. ఆ తర్వాత షాదాబ్ ఖాన్, సౌద్ షకీల్ జట్టును భారీ స్కోరు వైపు తీసుకెళ్లారు. షాట్‌లతో షాదాబ్ విరుచుకుపడితే, సౌద్ నిలకడగా బ్యాటింగ్ చేశాడు. అయితే ఈ ఇద్దరూ కీలక సమయంలో ఔటైపోయారు. ఆ తర్వాత వచ్చిన మహ్మద్ నవాజ్ (24) కొన్ని భారీ షాట్లు కొట్టినా... లోయర్ ఆర్డర్ నుంచి సరైన సహకారం అందలేదు. దీంతో పాక్ 270 పరుగులకు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో తబ్రైజ్ షంసీ 4 వికెట్లు, మార్కో జాన్సన్ 3 వికెట్లు, గెరాల్డ్ కొయిట్జీ 2, లుంగి ఎంగిడి ఒక వికెట్ తీశారు.

ఛేదనలో భాగంగా దక్షిణాఫ్రికా స్టార్ ఓపెనర్ డికాక్ (24), బవుమా(28) నిరాశపరిచారు. డుస్సెన్(21), క్లాసెన్(21), డేవిడ్ మిల్లర్(29) నిరాశపరచడంతో దక్షిణాఫ్రికా జట్టు 206పరుగుల వద్ద 5వ వికెట్ కోల్పోయింది. చివర్లో విజయానికి 9పరుగుల దూరంలో ఉండగా సఫారీజట్టు 9వికెట్లు కోల్పోయి దశలో ఉత్కంఠ నెలకొంది. చివర్లో కేశవ్ మహరాజ్ ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. దక్షిణాఫ్రికా గెలుపులో మార్క్‌క్రమ్(91) టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాంసీకి లభించింది.

స్కోర్‌బోర్డు..

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి)ఎన్గిడి (బి)జాన్సెన్ 9, ఇమామ్-ఉల్-హక్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 12, బాబర్ అజమ్ (సి)డికాక్ (బి)షాంసీ 50, రిజ్వాన్ (సి)డికాక్ (బి)కోర్జ్జే 31, ఇఫ్తికార్ అహ్మద్ (సి)క్లాసెన్ (బి)షాంసీ 21, షౌద్ షకీల్ (సి)డికాక్ (బి)షాంసీ 52, షాదాబ్ ఖాన్ (సి)మహరాజ్ (బి)కోర్జ్జే 43, నవాజ్ (సి)మిల్లర్ (బి)జాన్సన్ 24, షాహిన్ అఫ్రిది (సి)మహరాజ్ (బి)షాంసీ 2, మహ్మద్ వాసిం జూనియర్ (సి)డికాక్ (బి)ఎన్గిడి 7, హరీస్ రవూఫ్ (నాటౌట్) 0, అదనం 19. (46.4ఓవర్లలో ఆలౌట్) 270పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/38, 3/86, 4/129, 5/141, 6/225, 7/240, 8/259, 9/268, 10/270. **బౌలింగ్:** జాన్సెన్ 9-1-43-3, ఎన్గిడి 7.4-0-45-1, మార్క్రమ్ 4-0-20-0, మహరాజ్ 9-0-56-0, కోర్జ్జే 7-0-42-2, షాంసీ 10-0-60-4.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: బవుమా (సి)షౌద్ షకీల్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 28, డికాక్ (సి)మహ్మద్ వాసిం జూనియర్ (బి)షాహిన్ అఫ్రిది 24, డుస్సెన్ (ఎల్‌బి)ఉస్మా మిర్ 21, మార్క్రమ్ (సి)బాబర్ (బి)ఉస్మా మీర్ 91, క్లాసెన్ (సి)ఉస్మా మిర్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 12, డేవిడ్ మిల్లర్ (సి)రిజ్వాన్ (బి)షాహిన్ అఫ్రిది 29, జాన్సెన్ (సి)బాబర్ (బి)హరీస్ రవూఫ్ 20, కోర్జ్జే (సి)రిజ్వాన్ (బి)షాహిన్ అఫ్రిది 10, మహరాజ్ (నాటౌట్) 7, ఎన్గిడి (సి అండ్ బి)రవూఫ్ 4, షాంసీ (నాటౌట్) 4, అదనం 21. (47.2 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 271పరుగులు. **వికెట్ల పతనం:** 1/34, 2/67, 3/121, 4/136, 5/206, 6/235, 7/250, 8/250, 9/260 **బౌలింగ్:** ఇఫ్తికార్ అహ్మద్ 3-0-23-0, షాహిన్ అఫ్రిది 10-0-45-3, మహ్మద్ నవాజ్ 6.2-0-40-0, హరీస్ రవూఫ్ 10-0-62-2, మహ్మద్ వాసిం జూనియర్ 10-1-50-2, ఉస్మా మీర్ 8-0-45-2.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..

ఆస్ట్రేలియా × న్యూజిలాండ్
(వేదిక: ధర్మశాల; ఉ.10.30గం॥లకు)

నెదర్లాండ్స్ × బంగ్లాదేశ్
(వేదిక: కోల్‌కతా; మ.2.00గం॥లకు)

శీతల్‌కు మరో స్వర్ణం

ఆసియా పారా క్రీడలు



హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో జమ్ము-కాశ్మీర్‌కు చెందిన 16ఏళ్ల శీతల్ దేవి సంచలనం సృష్టిస్తోంది. శుక్రవారం జరిగిన మహిళల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. అలాగే మహిళల డబుల్స్‌లోనూ రజత పతకం చేజిక్కించుకొని ఆర్చరీలో మూడు పతకాలు సాధించిన తొలి పారా క్రీడాకారిణిగా నిలిచింది. గత వారం సింగిల్స్ విభాగంలో స్వర్ణం నెగ్గిన శీతల్.. నేడు సాధించిన పతకాలతో హ్యాట్రిక్ పతకాలను సొంతం చేసుకుంది. రెండు చేతుల్లేని శీతల్ ఆర్చరీలో కాళ్లతోనే విల్లంబులను సంధించి పతకాలను కొల్లగొట్టడం విశేషం. శుక్రవారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో శీతల్ 144-142పాయింట్ల తేడాతో సింగపూర్‌కు చెందిన అలీమ్-నూర్, సయాహిదాను ఓడించింది. ఇక ఎస్‌ఎల్-3 పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రమోద్ భగత్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో ప్రమోద్ 22-20, 21-19తో భారత్‌కే చెందిన నితీశ్‌కుమార్‌ను చిత్తుచేశాడు. ఇక ఎస్‌ఎల్-3, ఎస్‌ఎల్‌ఎఫ్-4 నితీశ్-తరున్ జోడీ స్వర్ణ పతకాన్ని ముద్దాడగా.. ప్రమోద్ భగత్-సుకాంత్ జోడీ కాంస్య పతకానికే పరిమితమైంది. పారాలింపిక్ ఛాంపియన్ కృష్ణ నగర్ ఎస్‌హెచ్-6లో 10-21, 21-8, 11-21తో ఫైనల్లో హాంకాంగ్‌కు చెందిన ఛు-మన్-కి చేతిలో ఓడి రజత పతకంతో సంతృప్తి చెందాడు.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	దక్షిణాఫ్రికా	6	5	1	10	+2.03
2.	భారత్	5	5	0	10	+1.35
3.	న్యూజిలాండ్	5	5	1	8	+1.48
4.	ఆస్ట్రేలియా	5	3	2	6	+1.14
5.	ఆఫ్ఘనిస్తాన్	5	2	3	4	-0.96
6.	శ్రీలంక	5	2	3	4	-0.20
7.	పాకిస్తాన్	6	2	4	4	-0.38
8.	ఇంగ్లండ్	4	1	3	2	-1.24
9.	బంగ్లాదేశ్	5	1	4	2	-1.25
10.	నెదర్లాండ్స్	5	1	4	2	-1.90

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రెట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68